Follow: @ANNTELUGU

ANN తెలుగు

25-07-2026

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 201 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్లు

- మొదటి విడతలో 7,680 ఫ్లాట్లు
- హైదరాబాద్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష

**హైదరాబాద్, మహా:** నగరంలోని నిరుపేదలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు చేరువలోనే సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. క్యూర్ పరిధిలో చేపట్టనున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై శుక్రవారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, జనావాసాల్లోనే గృహ నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూములను వెంటనే గుర్తించి గృహ నిర్మాణానికి వినియోగించాలని స్పష్టం చేశారు. సమీక్ష సమావేశంలో మాట్లాడిన ముఖ్యమంత్రి, ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలోని ఖాళీ ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల ఆధీనంలో ఖాళీగా ఉన్న స్థలాలను ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్


### కేటీఆర్ నీ నల్లచొక్కా డ్రామాలు నడవవ్



- పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఫైర్
- సీఆర్ ఎత్తేసిన ధర్నా చౌక్‌లో కేటీఆర్ ధర్నా

02


### బర్త్ డే నాడు..బ్లాక్ డ్రస్ తో ఇందిరాపార్క్ లో కేటీఆర్ ధర్నా



- యూత్ తో పెట్టుకుంటే శ్రీలంక గతే
- రాజ్యమా ఉలికిపడు అంటూ కేంద్రానికి వార్నింగ్

03

### కాక్రోచ్ జనతా పార్టీతో మోదీకి గండమే



- వేణు స్వామి సంచలన జోస్యం
- ఆ పార్టీకి విపరీతమైన రాజయోగం

03



# ప్రధాన్‌పై నేడు ప్రధాని డెసిషన్

## సీజేపీతో కేంద్రం చర్చలు



**రెండు డిమాండ్లకు ఓకే.. ప్రధాన్ పెండింగ్**

**పరిష్కరించకుంటే.. త్వరలోనే సీజేపి మరో జాతీయ స్థాయి ఉద్యమానికి పిలుపు**

- నేడు మరో విడత చర్చిస్తామన్న కేంద్రమంత్రి నడ్డా
- ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ భేటీ
- పదేళ్ల జైలు, రూ.10 కోట్ల వరకు జరిమానా.. కేంద్రం ఉక్కుపాదం
- లీక్‌లకు చెక్ పెట్టే బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా లోడింగ్ : సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే

**ఢిల్లీ, మహా :** పేపర్ లీక్ ఘటనలతో దేశవ్యాప్తంగా నిరసనలు చేలరేగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో మూడు ప్రధాన డిమాండ్లను కేంద్రం ముందు ఉంచామని సీజేపీ పేర్కొంది. మూడింట రెండు డిమాండ్లకు సానుకూలంగా స్పందించిన కేంద్రం.. ప్రధాన్ రాజీనామా డిమాండ్ పై మాత్రం 24గంటల సమయం కోరింది. శనివారం మధ్యాహ్నం మరో విడత చర్చలు జరగనున్నాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మిగతా 2వ పేజీలో


### సింగరేణికి పదేళ్ల రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలి

**ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఆదేశం**

- బొగ్గుతో పాటు క్రిటికల్ మినరల్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లోకి విస్తరించాలి
- ప్రైవేట్ పోటీని ఎదుర్కొనేలా నాణ్యత పెంచాలి
- సింగరేణి అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుంది
- సింగరేణి, జెన్‌కో ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- మణుగూరు ఓపెన్ కాస్ట్, బీటీపీఎస్ లను సందర్శించిన భట్టి

02






## జోడిమెట్లలో నాలాల దురాక్రమణ..!

**నాలాపై కమర్షియల్ నిర్మాణాలు..!**

- అడ్డదారిలో హెచ్ఎండీఏ అనుమతుల జారీ..!
- బహుళ అంతస్తుల నిర్మాణాలకు సన్నాహాలు..!
- ముడుపుల మత్తులో ఇరిగేషన్ ఎన్‌వోసీలు..!
- ఇరిగేషన్ చట్టాలు అక్రమార్కులకు చుట్టాలుగా మారిన వైనం..!
- ఇరిగేషన్ చట్టాలకు తూట్లు పొడుస్తున్న ఇంటి దొంగలు..!
- నాలాల కబ్జాతో నగర భవిష్యత్తుకు ముప్పు..!

02

హజ సిద్ధంగా ప్రవహించే నాలాలను ఆక్రమించి బిల్డర్లు దురాక్రమణకు తెగ బడ్డారు. కొద్దిపాటి వర్షానికే పొంగి ప్రవహించే నాలాలు తన సహజ ఉనికిని కోల్పోయి ఇప్పుడు అక్రమార్కుల కబంధ హస్తాల్లో చిక్కి శల్యమయ్యాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉధృతంగా ప్రవహించే నాలాలను మళ్ళించి ఆ నాలాలపైనే కమర్షియల్ సముదాయాలు, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలకు తెరలేపిన వ్యవహారం ఘట్కేసర్ సర్కిల్ జోడిమెట్లలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇరిగేషన్ చట్టాలను చుట్టాలుగా మార్చుకున్న అక్రమార్కులు నిబంధనలను తుంగలో తొక్కుతూ, వరద నీటి ప్రవాహానికి జీవనాడిగా ఉన్న నాలాలను పూడ్చి వేసి, కుదించి, సహజ ప్రవాహాన్ని మళ్లించి యదేచ్ఛగా నిర్మాణాలు సాగిస్తున్నారు. లక్షలాది రూపాయలు చేతులు మారడంతోనే నిబంధనలకు విరుద్ధంగా ఇరిగేషన్ శాఖ ఎన్‌వోసీలు, హెచ్ఎండీఏ అనుమతులు జారీ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి హెచ్ఎండీఏ నిర్మాణ అనుమతులు జారీ చేసే ముందు సంబంధిత రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించి, అక్కడ నాలాలు, చెరువులు, ప్రభుత్వ భూములు ఉన్నాయా లేదా అనే విషయాన్ని నిర్ధారించాల్సి ఉంటుంది. అయితే క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టకుండా, కేవలం ఇరిగేషన్, స్థానిక రెవెన్యూ అధికారుల నివేదికల ఆధారంగానే ఏసీ గదుల్లో కూర్చొని అనుమతులు జారీ చేశారన్న ఆరోపణలు బహిరంగంగా వ్యక్తమవుతున్నాయి. దీని ఫలితంగా వందల ఏళ్లుగా సహజసిద్ధంగా ప్రవహిస్తున్న నాలాలు క్రమంగా కనుమరుగవుతూ, వాటి స్థానంలో కమర్షియల్ నిర్మాణాలు వెలుస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**అన్నోజీగూడలో అరాచకం ఎపిసోడ్-5**

## విజయ్ మాల్యా బాటలోనే బాలరాజు గౌడ్...!

### 8 ఎకరాలు కొని.. 86 ఎకరాలపై కన్ను..!

- వందల కోట్ల బ్యాంకు రుణాల ఎగవేత...!
- చట్టబద్ధ యజమానులకే బెదిరింపులు..!
- 14 సర్వే నంబర్లపై పార్టీషన్ జరగలేదంటూ బ్యాంకులకు సైతం బురిడీ ..!
- మాజీ రౌడీషీటర్ అరాచకాలపై మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ కి ఫిర్యాదు..!
- మళ్లీ రౌడీషీట్ ఓపెన్ చేయాలని విన్నపం ..!
- సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ..!

02

"ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని అన్నోజిగూడలో మాజీ రౌడీషీటర్ బాలగోని బాలరాజ్ గౌడ్ చట్టంలోని లొసుగులను అడ్డం పెట్టుకుని ఒకవైపు బ్యాంకులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ, మరోవైపు బ్యాంకుల బహిరంగ వేలం (ఓపెన్ ఆక్షన్) ప్రక్రియను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్యాంకుల నుంచి కోట్లాది రూపాయల రుణాలు తీసుకుని వాటి చెల్లింపుల్లో విఫలమవడంతో, ఇప్పుడు మరో విజయ్ మాల్యాను తలపిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాకట్టు ఆస్తులను వేలం వేయడానికి బ్యాంకులు ముందుకు వస్తే, 'భూములకు ఇప్పటికీ పార్టిషన్ జరగలేదు.. యాజమాన్య వివాదాలు ఉన్నాయి.. కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి' అంటూ అభ్యంతరాలు వ్యక్తం చేయడం ద్వారా వేలం ప్రక్రియను అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో కోర్టుల ముందూ పార్టిషన్ జరగలేదనే వాదనను తెరపైకి తెచ్చి న్యాయ ప్రక్రియను సైతం తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ఫలితంగా అటు బ్యాంకులు తమ రుణాలను రికవరీ చేసుకోలేక, ఇటు అసలు పట్టాదారులు తమ హక్కులను వినియోగించుకోలేక, రైతులు, ప్లాట్ల యజమానులు తమ ఆస్తులపై స్వేచ్ఛగా నిర్మాణాలు చేపట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు, బాధితులు డిమాండ్ చేస్తున్నారు."

**మీరు ఇన్ స్టాలో.. యాక్టివ్ గా ఉంటున్నారా?**

**కేంద్రమంత్రులకు మోదీ ప్రశ్న** 02

# జోడిమెట్లలో నాలాల నాలాపై కమర్షియల్ నిర్మాణాలు..!

**మహా, స్టేట్ బ్యూరో చీఫ్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, ఘట్కేసర్ సర్కిల్, జోడిమెట్ల చౌరస్తాలో రియల్టర్ల అరాచకం పెట్రేగిపోతుంది. మేధా కంపెనీ నుండి ఎదురుగా, బజాజ్ ఎలక్ట్రానిక్స్ ను ఆనుకుని ఉధృతంగా ప్రవహించే నాలాలను సైతం ఆక్రమించి, సహజ వరద నీటి ప్రవాహాన్ని మళ్ళించి అరాచకాన్ని సృష్టిస్తున్నారు. నాలాలపై యధేచ్ఛగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల కమర్షియల్ నిర్మాణాల తీరు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వందల ఏళ్ల చరిత్ర కలిగిన సుదూర ప్రాంతాల నుండి నిత్యం జీవనదిలా ప్రవహించే నాలాలు సురక్షితంగా నీటిని నాడెం చెరువులోకి చేరుస్తుంది. నాలాల నుండి నాడెం చెరువులోకి ప్రవహించే సహజసిద్ధమైన నీటి ప్రవాహ మార్గానికి అక్రమార్కులు విఘాతం కలిగిస్తున్నారు. చట్టాల లోని లొసుగులను వాడుకుంటూ, అధికారులను ముడుపుల మత్తులో ముంచుతూ, ఏకంగా 20 మీటర్ల వెడల్పున్న నాలా స్థలంలోనే బహుళ అంతస్తుల కమర్షియల్ నిర్మాణాలు చేపడుతుండడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.


20 మీటర్ల నాలా దారి మళ్ళింపు

***అందిన కాడికి దండుకుని అడ్డదారిలో అనుమతులు జారీ**

కావాల్సిన ముడుపులు ముట్టజెప్పేసరికే క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు జాయింట్ సర్వే నిర్వహించకుండానే ఎన్ఓసీలు జారీ చేశారనే వాదనకు ప్రస్తుత పరిస్థితులే అద్దం పడుతున్నాయి. హెచ్ఎండిఏ పరిధిలో ఏవైనా అనుమతుల జారీ చేయాలంటే రెవెన్యూ-ఇరిగేషన్ శాఖల జాయింట్ సర్వే అత్యంత కీలకం. నాలా అసలు పరిమితులు ఏమిటి..? నిర్మాణాలు నాలా పరిధిలోకి వచ్చాయా లేదా..? సర్వే లేకుండానే సంబంధిత అధికారులు కేవలం దస్త్రాల ఆధారంగా అనుమతులు ఇచ్చేసారా..? వాస్తవ పరిస్థితులను క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండానే గుడ్డిగా నిర్మాణ అనుమతులు జారీ చేసారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా నాలా ఉనికిపైనే తీవ్ర వివాదం కొనసాగుతుండగా జాయింట్ సర్వే రిపోర్టును బహిర్గతం చేస్తే వాస్తవాలు బట్టబయలు అవుతాయని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలంటే అనుమతుల జారీకి ముందు నిర్వహించిన పరిశీలనలు, సర్వే నివేదికలు, సంబంధిత శాఖల అభిప్రాయాలను బహిరంగపరచాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**ఇరిగేషన్ చట్టాలకు తూట్లు..!**

నాలాలు, వాగులు, చెరువులు వంటి జలవనరులను రక్షించేందుకు ప్రభుత్వం స్పష్టమైన చట్టాలు, మార్గదర్శకాలు అమలు చేస్తోంది. ముఖ్యంగా సహజ నీటి ప్రవాహ మార్గాలను అడ్డుకోవడం, మళ్లించడం, ఆక్రమించడం చట్టవిరుద్ధం. అయినప్పటికీ జోడిమెట్ల నాలాల విషయంలో ఈ నిబంధనలు ఎంతవరకు అమలయ్యాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. నాలాల ఉనికిని గుర్తించకుండా, దాని పరిమితులను కాపాడకుండా నిర్మాణాలకు అనుమతులు లభించడం వెనుక భారీ స్థాయిలో ముడుపులు ముట్టడం వల్లనే ఇరిగేషన్ శాఖ నుంచి అభ్యంతరాలు లేకుండా అక్రమార్కులు కమర్షియల్ నిర్మాణాలు జరుపుతున్నారని స్థానికులు వాపోతున్నారు. నిబంధనలు సామాన్యులకేనా, లేక కార్పొరేట్ సంస్థలకు కూడా వర్తిస్తాయా అనే ప్రశ్నలు ప్రజల నుంచి ఉత్పన్నమవుతున్నాయి.

## హైడ్రా ఉక్కుపాదం మోపాలంటున్న స్థానికులు..!

జోడిమెట్లలో నాలాల దురాక్రమణలు, ఇరిగేషన్ ఎన్ఓసీల జారీ, హెచ్ఎండీఏ అనుమతుల వ్యవహారంపై హైడ్రా క్షేత్రస్థాయిలో బహిరంగ విచారణ జరిపి, నాలాల అసలు స్వరూపాన్ని గుర్తించి ఆక్రమణలను తొలగించడంతో పాటు, నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు జారీ చేసిన అధికారులు, అక్రమ నిర్మాణాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిదిలలో చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణల విషయంలో రాజీ లేకుండా వ్యవహరిస్తున్న హైడ్రా.. జోడిమెట్లలో జరుగుతున్న నాలాల దురాక్రమణలపై కూడా అదే స్థాయిలో ఉక్కుపాదం మోపాలని స్థానికులు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు. రానున్న వర్షాకాలానికి ముందే ఆక్రమణలను తొలగించి సహజ నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు

## ప్రజల ప్రాణాలతో చెలగాటమా..?

సహజ నీటి ప్రవాహ మార్గాలను ధ్వంసం చేయడం వల్ల కలిగే నష్టం ఒక్కరోజులో బయటపడదు. భవిష్యత్ తరాలకు ఇది శాపంగా మారనుంది. భారీ వర్షాలు కురిసిన సమయంలో దాని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. నీరు తన సహజ మార్గాన్ని కోల్పోతే అది సమీప కాలనీలు, రోడ్లు, నివాస ప్రాంతాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇప్పటికే హైదరాబాద్‌లో గతంలో జరిగిన వరదల నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉన్నప్పటికీ కొందరు స్వలాభాల కోసం నిబంధనలను గాలికొదిలేసి సహజ వనరులను నాశనం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చేతులు కాలక ఆకులు పట్టుకుంటే ప్రయోజనం ఏముంటుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

# నల్గొండ జిల్లా మీ రాజ్యం అనుకుంటున్నారా?

- రాజగోపాల్ రెడ్డిపై మందుల సామేల్ ఫైర్
- నా నియోజకవర్గంలో వేలుపెడితే సహించనని ఫైర్
- సామేల్ తీరుపై భగ్గుమన్న రాజగోపాల్ రెడ్డి



**తుంగతుర్తి, మహా :** కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మరోసారి ఫైర్ అయ్యారు. నల్గొండ జిల్లా మీ రాజ్యం అనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. తమ గురించి ఎందుకు హీనంగా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. వీరేశం 60వేల మెజారిటీతో, తాను 50వేల మెజారిటీతో గెలిచామని చెప్పారు. మీ దగ్గర మేము చేతులు చాచి గెలవలేదని మండిపడ్డారు. రాజగోపాల్ రెడ్డి తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాలు బాగాలేవు అని అంటున్నాడు.. ముందు ఆయన మునుగోడు పరిస్థితిని చూసుకోవాలన్నారు. మునుగోడులో అభివృద్ధి జరగలేదు, పరిస్థితి బాగాలేదని తనకు కూడా రిపోర్ట్ వచ్చిందన్నారు. రాజగోపాల్ రెడ్డి దీనికి సమాధానం చెప్పాలన్నారు. రాజగోపాల్ రెడ్డి బీజేపీలోకి పోయి, రాహుల్ గాంధీని తిట్టి, ఎన్నికలప్పుడు మళ్లీ కాంగ్రెస్‌లోకి వచ్చాడని అన్నారు. రెండు మంత్రి పదవులు మిగిలి ఉన్నాయని వాటిలో ఒకటి లంబాడి సామాజికవర్గానికి, మరొకటి యాదవ సామాజికవర్గానికి చెందినవారికి ఇవ్వాలని ముఖ్యమంత్రికి సూచించారు. లంబాడాలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పట్టారని కాబట్టి వారికి మంత్రి పదవి ఇవ్వాలని చెప్పారు. తన హక్కులను హరించిందుకు రాజగోపాల్ రెడ్డిపై రాహుల్ గాంధీ, ఖర్గేలకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. తాను తెలంగాణ పోరాటయోధుడనని తనపై పెత్తనం ఏంటని ప్రశ్నించారు. తొమ్మిది మంది మండల అధ్యక్షులను తానే ప్రకటించానని ఆపే దమ్ము నీకు ఎవరు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన నియోజకవర్గంలో వేలు పెడితే పనికి రాకుండా చేస్తానని హెచ్చరించారు.

# తప్పుడు వ్యక్తిని బరిలోకి దింపి గెలిపించా

- ఎమ్మెల్యే సామేల్ పై రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**మునుగోడు, మహా :** తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సమేల్ చేసిన వ్యాఖ్యలపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పందించారు. తుంగతుర్తి కాంగ్రెస్ కార్యకర్తలకు క్షమాపణలు చెబుతున్నానని, అక్కడ తప్పుడు వ్యక్తిని బరిలో దింపి గెలిపించానని అన్నారు. టికెట్ కోసం మందుల సామేల్ తన ఇంటికి వందసార్లు వచ్చాడని వ్యాఖ్యానించారు. చాలా మంది టికెట్ కోసం పోటీపడినా మాటిచ్చానని సామేల్ కు టికెట్ ఇప్పించి గెలిపించానని అన్నారు. తిరుమలలో ఉన్నప్పుడు తనకు సామేల్ ఫోన్ చేస్తే దేవుడి సన్నిధిలో ఉన్నానని, టికెట్ ఇప్పిస్తానని మాటిచ్చి అధిష్టానంతో మాట్లాడి ఇప్పించానని తెలిపారు. భాన్సువాడలో ఏనుగు రవీందర్ రెడ్డికి కూడా తానే టికెట్ ఇప్పించానని అన్నారు. తుంగతుర్తి, నకిరేకల్, భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొని వారిని గెలిపించానని చెప్పారు. ఎన్నికలకు తక్కువ సమయం ఉన్నా వారికోసం ప్రచారంలో పాల్గొన్నానని అన్నారు. తుంగతుర్తి మాత్రమే కాకుండా రాష్ట్రం మొత్తంలోని కాంగ్రెస్ కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యత తనపై ఉందని, ఆయారాం, గయారాంలకు తాను భయపడనని వ్యాఖ్యానించారు. నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యత పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పై, రాష్ట్ర కాంగ్రెస్ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ పై తమలాంటి నాయకులపై కూడా ఉందన్నారు.

# జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్లు

( మొదటి పేజీ తరువాయి )

వినియోగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నగరానికి దూరంగా కాకుండా ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉండే ప్రాంతాల్లోనే గృహాలు నిర్మిస్తే లబ్ధిదారులకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు.మొదటి విడతలో రాష్ట్రంలోని 17 నియోజకవర్గాల్లో మొత్తం 7,680 ఇందిరమ్మ ఫ్లాట్ల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఒక్కో ఫ్లాట్‌ను 528 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నట్లు తెలిపారు. ఒక్కో ఫ్లాట్ నిర్మాణానికి సుమారు రూ.11 లక్షల వ్యయం అవుతుందని, ఇందులో ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందించనుందని చెప్పారు. భూమి విలువ మొత్తాన్ని పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. ఖాళీ ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసి నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. నగర పరిసర ప్రాంతాలకు పరిమితం కాకుండా ప్రజలు నివసిస్తున్న ప్రాంతాల్లోనే గృహాలను నిర్మించడం ద్వారా నిరుపేదలకు మెరుగైన జీవన వాతావరణం, ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ తో పాటు డిజిపి సీవీ ఆనంద్, సీనియర్ ఐఎఎస్ లు వికాస్ రాజ్. శ్రీధర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



మీరు ఇన్ స్టాలో..

# యాక్టివ్‌గా ఉంటున్నారా?

**కేంద్రమంత్రులకు మోదీ ప్రశ్న**

**ఢిల్లీ, మహా :** యువతకు మరింతగా చేరువయ్యేందుకు కేంద్ర మంత్రులు ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో యాక్టివ్‌గా ఉండాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. శుక్రవారం కేబినెట్ సమావేశం సందర్భంగా మంత్రులకు ఈ మేరకు సూచించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎంత మంది యాక్టివ్‌గా ఉంటున్నారని ప్రధాని మోదీ మంత్రులను ప్రశ్నించారు. ప్రస్తుతం దేశంలో యువత ఎక్కువ సమయం సోషల్ మీడియాలోనే ఉంటున్నట్టు చెప్పారు. కాబట్టి ప్రభుత్వం సోషల్ మీడియా వేదికల్లో యువతకు దగ్గరయ్యేందుకు ప్రయత్నించాలని సూచించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో పోస్టు చేసినంత మాత్రాన సరిపోదని ప్రధాని మంత్రులకు చెప్పినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. సోషల్ మీడియాలో నేరుగా యువతతో టచ్‌లో ఉండాలని ప్రధాని సూచించారు. యువతకు మరింత దగ్గర చేసే రీల్స్ వంటి క్రియేటివ్ కంటెంట్‌ను పోస్టు చేస్తూ ఉండాలని కూడా ప్రధాని సూచించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.




# కేటీఆర్ నీ నల్లచొక్కా డ్రామాలు నడవవ్

- పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఫైర్
- కేసీఆర్ ఎత్తేసిన ధర్నా చౌక్‌లో కేటీఆర్ ధర్నా

**హైదరాబాద్, మహా :** పుట్టినరోజు నాడైనా కేటీఆర్ నిజాలు మాట్లాడలేదని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అన్నారు శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నల్ల చొక్కాలు వేసుకున్నంత మాత్రాన ప్రజలు నమ్మరన్నారు. కపట ప్రేమలు, నల్లచొక్కా డ్రామాలు నడవవని చెప్పుకొచ్చారు. 'రేవంత్ ఢిల్లీకి వెళ్తే ఏంటి? వెళ్లకపోతే ఏంటి?.. కొడంగల్‌లో నిరసన చేశారు' అని అన్నారు. విద్యార్థుల ఉద్యమంపై కేసీఆర్ ఇప్పటిదాకా ఒక్క స్టేట్మెంట్ ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్ ఎత్తేసిన ధర్నా చౌక్‌లో కేటీఆర్ ధర్నా చేశారని.. ధర్నా చేసే హక్కు ఆయనకు ఎక్కడిదని ప్రశ్నించారు. కేటీఆర్ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాక ధర్నా చేస్తే బాగుంటుందని మహేష్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో చనిపోయిన ప్రతి ఒక్కరికి బీఆర్ఎస్ అకౌంట్ నుంచి రూ.2 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 27 మంది విద్యార్థుల మరణానికి కారణం గ్లోబరీనా సంస్థ అని ఆరోపించారు. 2011లో జరిగిన గ్లోబరీనా అంశంలో నివేదిక ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. 'గ్లోబరీనాపై విచారణకు కేటీఆర్ ఫిర్యాదు చేయాలి. మాకు మేముగా విచారణ చేస్తే కక్ష సాధింపు అంటారు' అని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో పేపర్ లీక్‌లు అందరికీ తెలుసని అన్నారు. ఇసుక వ్యాపారంతో ఎంతోమంది చావులకు కారణం కేటీఆర్ అని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరు కాదని.. రెండూ ఒకటే అనడానికి బలమైన కారణాలు ఉన్నాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# ప్రధాన్‌పై నేడు ప్రధాని డెసిషన్

( మొదటి పేజీ తరువాయి )

డిమాండ్ పై మాత్రం 24గంటల సమయం కోరింది. శనివారం మధ్యాహ్నం మరో విడత చర్చలు జరగనున్నాయి. ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేస్తారని ఆశిస్తున్నామని సీజేపీ అధికారప్రతినిధి అశుతోష్ రాంకా చర్చల అనంతరం తెలిపారు. మరోవైపు ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ భేటీ జరగ్గా, లీక్ లకు చెక్ పెట్టే బిల్లులకు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది.



**గంటన్నర చర్చలు**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను రాజీనామా చేయాల్సిందేనని సీజేపీ డిమాండ్ చేసింది. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలని, విద్యార్థులపై నమోదైన కేసులు కొట్టివేయాలని కోరామని పేర్కొంది. అయితే, ఈ మూడు డిమాండ్లను పరిష్కరించేందుకు శనివారం మధ్యాహ్నం వరకు వేచిచూస్తామని సీజేపీ వెల్లడించింది. గంటన్నరకు పైగా వీరి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విద్యావ్యవస్థలో సమూల సంస్కరణలు తీసుకురావాలని సీజేపీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు కేంద్రమంత్రులకు వినతిపత్రం అందించారు. పరిహారం, కేసుల ఎత్తివేతకు కేంద్రం సానుకూలంగా ఉందన్న సీజేపీ ప్రతినిధులు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేవరకు ఉద్యమం ఆగదని తేల్చిచెప్పారు. ఈ భేటీకి ప్రభుత్వం తరపున కేంద్రమంత్రులు జేపీ నడ్డా, జితేందర్ సింగ్ హాజరయ్యారు. సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్, జాతీయ అధికార ప్రతినిధి అశుతోశ్ హాజరయ్యారు. ప్రభుత్వంతో సుదీర్ఘ చర్చలు జరిగాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా లేదా ఆయన్ను పదవి నుంచి తొలగించకుండా మేం శాంతికి అంగీకరించబోమని ప్రభుత్వానికి చాలా స్పష్టంగా చెప్పాం. ఈ అంశంపై సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వం శనివారం మధ్యాహ్నం వరకు సమయం అడిగింది. ఒకవేళ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా లేదా తొలగింపు త్వరగా జరగకపోతే, ఈ ఆందోళనలు మరింత తీవ్రమవుతాయి. త్వరలోనే సీజేపి మరో జాతీయ స్థాయి ఉద్యమానికి పిలుపు ఇవ్వాల్సి ఉంటుంది. పరిహారం, న్యాయపరమైన కేసుల విషయంలో ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ఇది సానుకూల పరిణామం. మళ్లీ ప్రభుత్వంతో శనివారం సమావేశం కానున్నాం. ధర్మేంద్ర ప్రధాన్‌ను రాజీనామా చేస్తారని మేం ఆశిస్తున్నాం." అని సీజేపీ జాతీయ అధికార ప్రతినిధి అశుతోష్ తెలిపారు.

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా లోడింగ్..**

ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ప్రధాని మోదీని కోరారు. ఒకవేళ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తీసుకోకపోతే, దేశవ్యాప్తంగా రోడ్లపైకి వచ్చిన యువత మీ రాజీనామాను కోరడం ప్రారంభిస్తారని వ్యాఖ్యానించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేస్తే విద్యార్థుల కంటే మోదీకే ఎక్కువ మేలు ఉంటుందని తెలిపారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా లోడ్ అవుతోందని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**కేంద్ర కేబినెట్ ఆమోదంబ**

ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు కారణమవుతున్న వేళ వాటిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో పేపర్ లీక్‌లను అరికట్టే దిశగా కీలక అంశాలపై చర్చించారు. ఇప్పటికే అమల్లో ఉన్న 2024 ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టంలో సవరణలు చేసి మరింత కఠిన నిబంధనలు తీసుకురావాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంచేందుకు, పేపర్ లీకేజీ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రధాని అధ్యక్షతన ఇవాళ ఢిల్లీలో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో అత్యంత కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా పేపర్ లీక్ చట్ట సవరణ బిల్లుకు ఆమోదం తెలిపిన కేంద్రం, అక్రమాలకు పాల్పడేవారికి గరిష్టంగా 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా కఠిన నిబంధనలను పొందుపరిచింది.

# విజయ్ మాల్యా బాటలోనే బాలరాజు గౌడ్...!

**మహా, స్టేట్ బ్యూరో చీఫ్:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, ఘట్‌కేసర్ సర్కిల్, అన్నోజిగూడలో భూ వివాదం రోజురోజుకూ కొత్త మలుపులు తిరుగుతోంది. ఒకవైపు బ్యాంకులకు కోట్లాది రూపాయల రుణాలను ఎగ్గొట్టారనే ఆరోపణలు, మరోవైపు కేవలం 8 ఎకరాల కొనుగోలును ఆధారంగా చేసుకుని ఏకంగా 86 ఎకరాల భూములపై హక్కులు చెలాయించే ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలు మాజీ రౌడీషీటర్ బాలగోని బాలరాజ్ గౌడ్‌పై వెల్లువెత్తుతున్నాయి. చట్టంలోని లొసుగులను అస్త్రంగా మార్చుకుని అటు బ్యాంకులను, ఇటు రైతులు, పట్టాదారులు, ప్లాట్ల యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో బాధితులు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌ను ఆశ్రయించడం ప్రాధాన్యత సంతరించుకుంది.



**8 ఎకరాల కొనుగోలు.. 86 ఎకరాలపై పెత్తనం ..!**

స్థానికుల కథనం ప్రకారం బాలగోని బాలరాజ్ గౌడ్ కుటుంబం కొనుగోలు చేసిన భూమి కేవలం 8 ఎకరాలే. అయితే ప్రస్తుతం 14 సర్వే నంబర్లలో విస్తరించి ఉన్న సుమారు 86 ఎకరాల భూములపై హక్కులు చెలాయించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ భూములకు ఐదుగురు పట్టాదారులు ఉండగా, ఒక్కో పట్టాదారుకు సుమారు 17.10 ఎకరాల చొప్పున హక్కులు ఉన్నట్లు బాధితులు చెబుతున్నారు.

**బ్యాంకులకు బురిడీ..?**

బ్యాంకుల నుంచి తీసుకున్న భారీ రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో తాకట్టు ఆస్తులను బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు బ్యాంకులు చర్యలు చేపట్టినట్లు సమాచారం. అయితే "భూములకు ఇప్పటివరకు పార్టీషన్ జరగలేదు.. కోర్టు వివాదాలు ఉన్నాయి.." అంటూ అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వేలం ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో బ్యాంకులు తమ బకాయిలను రికవరీ చేసుకునే ప్రక్రియకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని బాధితులు పేర్కొంటున్నారు.

**చట్టంలోని లొసుగులే ఆయుధంగా..!**


చట్టంలోని లొసుగులను అడ్డం పెట్టుకుని ఒకవైపు బ్యాంకులను, మరోవైపు చట్టబద్ధ యజమానులను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పార్టీషన్ జరగలేదనే వాదనను అడ్డం పెట్టుకుని కోర్టుల్లోనూ, బ్యాంకుల ముందూ అభ్యంతరాలు వ్యక్తం చేయడం ద్వారా ప్రక్రియలను ఆలస్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా అసలు పట్టాదారులు, రైతులు, ప్లాట్ల యజమానులు తమ హక్కులను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారని చెబుతున్నారు.

**భయభ్రాంతుల్లో రైతులు, ప్లాట్ల యజమానులు..!**

ఇప్పటికే భూముల వద్ద బౌన్సర్ల హల్‌చల్, బెదిరింపులు, ప్రహరీ గోడల కూల్చివేత యత్నాల ఆరోపణలు వెలుగులోకి రావడంతో రైతులు, ప్లాట్ల యజమానులు భయాందోళనలకు గురవుతున్నట్లు తెలుస్తోంది. తమకు రక్షణ కల్పించాలని బాధితులు పలుమార్లు పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం.

**మాజీ రౌడీషీటర్ అరాచకాలపై మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ కి ఫిర్యాదు..!**

అన్నోజిగూడలో మాజీ రౌడీషీటర్ బాలగోని బాలరాజు గౌడ్ అరాచకాలు, భూ వివాదాలు, బౌన్సర్లతో బెదిరింపులు, ప్రజా రహదారుల ఆక్రమణల అంశాలపై మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతికి స్థానిక రైతులు, ప్లాట్ల యజమానులు, బాధితులు ఫిర్యాదు చేశారు. సదరు ఫిర్యాదుపై స్పందించిన కమిషనర్ సుమతి సంబంధిత అంశాలపై పూర్తి వివరాలు సేకరించి సమగ్ర విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఎవరైనా బెదిరింపులకు, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.










**సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ..!**


"అన్నోజిగూడ భూ వివాదానికి సంబంధించి బాధితులు చేసిన ఫిర్యాదును స్వీకరించాం. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించాం. చట్టాన్ని ఎవరైనా తమ చేతుల్లోకి తీసుకుంటే ఉపేక్షించేది లేదు. భూముల విషయంలో బెదిరింపులు, దౌర్జన్యాలు, బలవంతపు కబ్జా యత్నాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. బాధితులకు పూర్తి రక్షణ కల్పించడంతో పాటు శాంతిభద్రతలకు భంగం కలగకుండా పోలీసు శాఖ అవసరమైన చర్యలు చేపడుతుంది. విచారణలో వెలుగులోకి వచ్చే వాస్తవాల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, మహా:** అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ముడిచమురు ధరల పెరుగుదల, అమెరికా ప్రకటించిన కొత్త దిగుమతి సుంకాల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాల్లో ముగిశాయి. ఉదయం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 833 పాయింట్లు, నిఫ్టీ 243 పాయింట్లు వరకు పడిపోగా, బ్యాంకింగ్, ఐటీ, ఆటో, మెటల్ షేర్లలో భారీ అమ్మకాలు నమోదయ్యాయి. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు, భారత్ సహా పలు దేశాలపై అమెరికా కొత్త సుంకాలు విధించడం పెట్టుబడిదారుల్లో ఆందోళన పెంచింది. మరోవైపు ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లకు పైగా చేరడంతో మార్కెట్ సెంటిమెంట్ బలహీనపడింది. ఈ పరిణామాలతో ప్రపంచ మార్కెట్ల ప్రభావం దేశీయ సూచీలపైనా తీవ్రంగా కనిపించింది.

# కాక్రోచ్ జనతా పార్టీతో మోదీకి గండమే

- వేణు స్వామి సంచలన జోస్యం
- ఆ పార్టీకి విపరీతమైన రాజయోగం



**హైదరాబాద్, మహా :** కాక్రోచ్ జనతాపార్టీకి ప్రధాని నరేంద్రమోదీకి, బిజెపికి నష్టమేనని, అక్టోబర్ దాకా కాక్రోచ్ పార్టీకి అద్భుతయోగం ఉందని.. రెచ్చగొట్టే ధోరణిలో కాకుండా సామరస్యపూర్వకంగా కేంద్రం సీజేపీతో వ్యవహరించాలని ప్రముఖ జ్యోతిష్యుడు వేణుస్వామి సంచలన జోస్యం చెప్పారు. లఘ్న కుండలి ప్రకారం సీజేపీ పార్టీ జోతిష్యంలో బుధాదిత్య యోగం కనిపిస్తుందన్నారు. అందువల్లే పార్టీకి విపరీతమైన క్రేజ్, అటెన్షన్ వస్తున్నాయని చెప్పారు. కాలసర్ప సహిత రాజయోగం కనిపించిన పార్టీ సీజేపీ అన్నారు. 2026 అక్టోబర్ 31 వరకు ఈ పార్టీకి విపరీతమైన క్రేజ్ ఉంటుందని చెప్పారు. తరవాత మరోవిధమైన క్రేజ్ వస్తుందని తెలిపారు. రాశిచక్రం పరిశీలిస్తే విపరీతమైన రాజయోగం కనిపిస్తుందన్నారు. వీరిని అణచివేయాలని చూస్తే రివర్స్ అవుతుందని అన్నారు. కాబట్టి చాలా పద్ధతిగా వీరిని హ్యాండిల్ చేయాలన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతాపార్టీ డిమాండ్ చేస్తుందని.. వందకు వందశాతం ఆయన రాజీనామా చేసే అవకాశం ఉందన్నారు. సీజేపీ పార్టీకి చెందిన ముగ్గురు ముఖ్యులు తరవాత జైలుకు వెళ్లే అవకాశం ఉందన్నారు. సీజేపీ ధర్మం గురించి పట్టించుకోకుండా మరో మార్గంలో వెళ్లే అవకాశం ఉందన్నారు. ఈ పార్టీవల్ల నరేంద్రమోదీ, బీజేపీకే ఎక్కువ నష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు. రాబోయే కాలంలో ఒక పార్టీని గద్దెను ఎక్కించాలన్నా.. దించాలన్నా సీజేపీ ప్రభావం చూపిస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు.

# బర్త్ డే నాడు.. బ్లాక్ డ్రస్ తో ఇందిరాపార్క్ లో కేటీఆర్ ధర్నా

- యూత్ తో పెట్టుకుంటే శ్రీలంక గతే
- రాజ్యమా ఉలికిపడు అంటూ కేంద్రానికి వార్నింగ్



**హైదరాబాద్, మహా :** నీట్ ప్రశ్నపత్రాల లీకేజీకి నిరసనగా, ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు నిరసనగా, బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. తన జన్మదినం రోజు నలుపుడ్రెస్ లో విద్యార్థులకు సంఘీభావంగా ధర్నా చేపట్టారు. శుక్రవారం ఈ ధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. ప్రధాని నరేంద్ర మోదీని, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. దేశంలో యువత ఆలోచనల్లో, స్వరంలో మార్పు వచ్చింది. "మోదీ.. మీరు పెట్టుకోకూడని వారితో పెట్టుకున్నారు. ఈ దేశ యువతరంతో పెట్టుకున్నారు. జాగ్రత్త పడండి. స్వరం మారుతున్నది.. నవతరం మారుతున్నది. 'రాజ్యమా ఉలికిపడు' అంటూ యువత గర్జిస్తోంది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే గుర్తింపుంచాలి" అని కేటీఆర్ అన్నారు. గతంలో శ్రీలంకలో ఉప్పొంగిన యువతరం అక్కడి ప్రభుత్వాలను ఎలా ఉరికించి పాతరేసిందో గుర్తుచేసిన కేటీఆర్, అలాంటి శక్తివంతమైన యువతరంతో పెట్టుకోవద్దని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల డిమాండ్లపై స్పందించకుండా కాలయాపన చేస్తోందని ఆయన మండిపడ్డారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా పోరాడుతున్న విద్యార్థులను తీవ్రవాదులు, దేశద్రోహులు, పాకిస్తానీలు అంటూ అడ్డగోలుగా మాట్లాడటం హేయమైన చర్య అని మండిపడ్డారు. ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# గుర్రం జాషువాకు బీజేపీ నివాళి

**ఆయన ఆశయాలు భావితరాలకు చేరాలి.**
**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పి వి ఎన్ మాధవ్.**

**విశాఖపట్నం, మహా.** మహాకవి గుర్రం జాషువా ఆశయాలు భావితరాలకు తీసుకువెళ్లాల్సిన గురుతరబాధ్యత మనపై ఉన్నదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు పి వి ఎన్ మాధవ్ అన్నారు. శుక్రవారం మహాకవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా విశాఖపట్నంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. సామాజిక చైతన్యం, సమానత్వ భావనలను ప్రజల్లో నాటిన గుర్రం జాషువా ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడిన తెలుగు సాహిత్యంలో గుర్రం జాషువా అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన రచనలు సమాజానికి మార్గదర్శకంగా నిలిచాయని, ముఖ్యంగా గబ్బిలం వంటి అమూల్యమైన కావ్యం ద్వారా సమాజంలోని అసమానతలను ప్రశ్నిస్తూ మానవతా విలువలను చాటిచెప్పారని గుర్తు చేశారు. మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, వారి స్ఫూర్తితో సమాజ సంక్షేమానికి మరింత అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి ప్రకాశ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రౌణంకి విజయచంద్రలను అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు పరశురామరాజుతో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ మోర్చాల పదాధికారులు, పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

# కోర్టు వీడియోలపై సుప్రీం ఆంక్షలు

**అనుమతి లేకుండా పోస్టు చేస్తే ధిక్కార చర్యలు.**

**ఢిల్లీ, మహా. :** కోర్టు విచారణలకు సంబంధించిన ఆడియో, వీడియో రికార్డింగ్‌ల వినియోగంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కోర్టు విచారణల వీడియోలను అనుమతి లేకుండా సోషల్ మీడియాలో పోస్టు చేయడాన్ని నిషేధించిన ధర్మాసనం, వాటిని ఉపయోగించాలంటే సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్ లేదా సంబంధిత హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే కోర్టు ధిక్కార చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.

కోర్టు విచారణల ప్రత్యక్ష ప్రసారాలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో దుర్వినియోగం చేస్తున్నారంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. విచారణలకు సంబంధించిన దృశ్యాలను మీమ్స్, రీల్స్, షార్ట్స్ రూపంలో వైరల్ చేయడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. వ్యూస్, లైక్‌ల కోసం కోర్టు వ్యాఖ్యలను సంచలనాత్మకంగా మార్చి ప్రచారం చేయడం వల్ల న్యాయమూర్తులు, న్యాయవాదుల గౌరవానికి భంగం కలుగుతోందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కోర్టు విచారణల వీడియోలను వాడుకోవడం సహించబోమని స్పష్టం చేసింది. అనుమతి లేకుండా కోర్టు విచారణల వీడియోలను సోషల్ మీడియా వేదికల్లో అప్‌లోడ్ చేసిన వారిపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకునే అవకాశం ఉందని ధర్మాసనం హెచ్చరించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని తెలియజేయాలని కోరుతూ నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణకు కేసును వాయిదా వేసింది.



# సింగరేణికి పదేళ్ల రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలి



**మణుగూరు, కొత్తగూడెం, మహా** సింగరేణి సంస్థను కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం చేయకుండా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ, క్రిటికల్ మినరల్స్ వంటి రంగాల్లోకి విస్తరించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. సింగరేణిని కాపాడుకోవడం, బలోపేతం చేయడం, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడం కోసం ప్రజా ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సంస్థ అభివృద్ధికి ప్రభుత్వ తలుపులు 24 గంటలూ తెరిచే ఉంటాయని భరోసా ఇచ్చారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సింగరేణి, జెన్‌కో ఉన్నతాధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు. తెలంగాణకు సింగరేణి ఆత్మలాంటి సంస్థ అని, 130 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ సంస్థ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే 1520 ఏళ్లలో ప్రపంచ ఇంధన రంగం పూర్తిగా మారిపోతుందన్నారు. సోలార్, పంప్డ్ స్టోరేజ్, విండ్, గ్రీన్ హైడ్రోజన్, రేర్ ఎర్త్ మినరల్స్, బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థల వినియోగం పెరగడంతో థర్మల్ విద్యుత్, బొగ్గు వినియోగం క్రమంగా తగ్గే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ మార్పులను దృష్టిలో పెట్టుకుని సింగరేణి ప్రత్యామ్నాయ వ్యాపార అవకాశాలపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలని సూచించారు. ప్రైవేట్ సంస్థలతో పోటీ పెరిగిన నేపథ్యంలో సింగరేణి నాణ్యత, నిర్వహణా సామర్థ్యం, వ్యయ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. తవ్వకాల సమయంలో బొగ్గులో మట్టి, రాళ్లు కలవకుండా కఠిన పర్యవేక్షణ ఉండాలని, బొగ్గు శుద్ధీకరణను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. వివిధ గ్రేడ్ల బొగ్గును శాస్త్రీయంగా బ్లెండింగ్ చేసి వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించాలన్నారు.

**మణుగూరు ఓసిని పరిశీలించిన భట్టి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఓపెన్ కాస్ట్ బొగ్గు గనిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గనిలోకి వెళ్లి బొగ్గు ఉత్పత్తి విధానం, బొగ్గు నాణ్యత, తవ్వకాల పురోగతి, గని నిర్వహణ తీరును స్వయంగా పరిశీలించి అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సింగరేణి భవిష్యత్‌ను బలోపేతం చేయాలంటే కొత్త బొగ్గు గనులను సొంతం చేసుకోవడం అత్యంత కీలకమని అన్నారు. రాష్ట్ర భవిష్యత్ ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం నిర్వహించే బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియలో సింగరేణి సంస్థ చురుగ్గా పాల్గొని వీలైనన్ని కొత్త బ్లాకులను దక్కించుకోవాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పీకే ఓసీ డిప్ సైడ్ బ్లాక్ కూడా సింగరేణికే కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ప్రపంచ ఇంధన రంగంలో మార్పులు చోటుచేసుకుంటున్న ఈ సమయంలో సింగరేణి మరింత బలోపేతం కావాలంటే కొత్త బొగ్గు నిల్వలను భద్రపరచుకోవడం, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడం అత్యవసరమని పేర్కొన్నారు.

## రక్షణకు చట్టాలు పటిష్ఠంగా అమలు చేయాలి

**బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు**

**హైదరాబాద్, మహా.** హైందవ ధర్మంలో గోమాతకు అత్యున్నత స్థానం ఉందని, గోరక్షణకు సంబంధించిన చట్టాలను రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా అమలు చేయాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు కోరారు. ఎల్‌బీనగర్‌లోని బైరమల్‌గూడ శ్రీ హనుమాన్ గోశాలను శుక్రవారం సందర్శించిన ఆయన, గోవధ నిరోధక చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, హైందవ ధర్మంలో గోమాతకు విశిష్టమైన స్థానం ఉందన్నారు. పాలు, పాడి ఉత్పత్తులు, సహజ సిద్ధమైన ఎరువుల ద్వారా గోమాత మానవాళి సంక్షేమానికి నిరంతరం సేవలందిస్తోందని, అందువల్ల గోమాతను సంరక్షించడం, గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో కొందరు గోవులను అవమానించేలా, గోహత్యలను ప్రోత్సహించేలా వ్యవహరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గోవులను రక్షించడం ద్వారా సమాజానికి మేలు జరుగుతుందనే అవగాహన ప్రతి ఒక్కరిలో పెరగాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గోవధ నిరోధక చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి గోహత్యలను పూర్తిగా అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని రాంచందర్‌రావు కోరారు. గోరక్షణలో ప్రభుత్వం మాత్రమే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆగస్టు 30 నాటికి రెండు జతల యూనిఫాంలు

- ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు విస్తృత అవగాహన.
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు.



**హైదరాబాద్, మహా :** ప్రభుత్వ, రెసిడెన్షియల్, కేజీబీవీ, మోడల్ పాఠశాలల విద్యార్థులందరికీ ఆగస్టు 30 నాటికి రెండు జతల నాణ్యమైన యూనిఫాంలు అందేలా అన్ని దశల్లో పకడ్బందీగా పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అలాగే నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించాలని, జూలై 27 నుంచి 29 వరకు రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లో ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.

శుక్రవారం హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, సెర్ప్ సీఈవో దివ్య, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్‌తో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సంజయ్ జాజు, పాఠశాల యూనిఫాంల కుట్టు పనుల పురోగతి, సీజనల్ పరిస్థితులు, పంటల వైవిధ్యీకరణపై సమీక్షించారు.

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి పంటల వైవిధ్యీకరణ అత్యంత ప్రాధాన్య అంశమని సంజయ్ జాజు పేర్కొన్నారు. గత ఏడాది ఇదే సమయానికి 54 లక్షల ఎకరాల్లో వరి సాగు జరగగా, ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం 14 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు జరిగిందన్నారు. రాష్ట్రంలో మొత్తం 1.39 కోట్ల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా ఇప్పటివరకు సగం విస్తీర్ణంలో మాత్రమే సాగు పూర్తైందని తెలిపారు. మిగిలిన భూములను బీడుగా వదిలిపెట్టకుండా కంది, పెసర, మినుములు, అలసందలు, పొద్దుతిరుగుడు, చిరుధాన్యాలు, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని ఆదేశించారు. భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో బోరు నీటిపై ఆధారపడిన వరి సాగును నిరుత్సాహపరచాలని సూచించారు.

జూలై 27 నుంచి 29 వరకు అన్ని రైతు వేదికల్లో ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పంటల వైవిధ్యీకరణలో ఉత్తమ ఫలితాలు సాధించిన జిల్లాలను ప్రభుత్వం అభినందిస్తుందని సంజయ్ జాజు తెలిపారు.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆగస్టు 15 నాటికి ప్రతి విద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందించాలని తెలిపారు. యూనిఫాంల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని, డీఆర్‌డీఏ అధికారులు కుట్టు పనులను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, వస్త్రాల కటింగ్‌ను వెంటనే ప్రారంభించాలని సూచించారు.

వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ, సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సుమారు 40 శాతం వర్షపాతం లోటు నమోదైందని, జలాశయాలు, భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ సాగు, డ్రిప్ సేద్యాన్ని ప్రోత్సహించాలని, ప్రతి గ్రామంలో కంటింజెన్సీ ప్రణాళికలు సిద్ధం చేసి రైతులకు వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని సూచించారు. ఆగస్టులో కొంత వర్షం కురిసినా వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటలకు సరిపోదని, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కూడా వర్షాభావ పరిస్థితులు కొనసాగే అవకాశముందని హెచ్చరించారు.

సెర్ప్ సీఈవో దివ్య మాట్లాడుతూ, ఆగస్టు 30 నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాంలు అందించడమే లక్ష్యమని తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాల టైలర్లు రెట్టింపు వేగంతో కుట్టు పనులు పూర్తి చేయాలని, వస్త్రాల సరఫరా, కటింగ్, కుట్టు పనులను దశలవారీగా వేగవంతం చేయాలని సూచించారు. మండల స్థాయిలో బటన్ హోల్, బటన్ ఫిక్సింగ్ యంత్రాలను వినియోగించి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

యూనిఫాంల నాణ్యతపై విద్యార్థుల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరిస్తామని, లోపాలు తలెత్తితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని సంజయ్ జాజు హెచ్చరించారు. జిల్లా, మండల స్థాయిలో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి వస్త్రాల సరఫరా నుంచి యూనిఫాంల పంపిణీ వరకు ప్రతి దశను రోజువారీగా పర్యవేక్షించాలని ఆదేశించారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనంతా పేపర్ లీకేజీల మయం

- జెన్ జీ తరం ఆ రెండు పార్టీలను నిలదీయాలి.
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్




**హైదరాబాద్, మహా.**

నీట్ వ్యవహారంపై విపక్షాలు చేస్తున్న రాద్ధాంతాన్ని తిప్పికొడుతూ, గతంలో పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నైతికతను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యేలు పైడి రాకేశ్ రెడ్డి, పాల్వాయి హరీష్, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమరయ్య, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్, అధికార ప్రతినిధులు సీహెచ్.విఠల్, జె.సంగప్ప తదితరులు పాల్గొన్నారు.

**జెన్ జీ తరం ఆలోచించాలి – కేసీఆర్, రేవంత్ రెడ్డిల రాజీనామా ఏది?**

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎంసెట్, టీఎస్పీఎస్సీ గ్రూప్ 1, ఎస్సెస్సీ పేపర్లు లీక్ అయ్యాయని, కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలోనూ పదో తరగతి తెలుగు, హిందీ పేపర్లు లీక్ అయ్యాయని బండి సంజయ్ ఆరోపించారు. మరి నాడు ప్రశ్నాపత్రాలను అమ్ముకుని విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసిన కేసీఆర్, కేటీఆర్ గానీ, నేడు గ్రూప్1 అక్రమాలతో 4 లక్షల మంది నిరుద్యోగులను వంచించిన రేవంత్ రెడ్డి గానీ ఎందుకు రాజీనామా చేయలేదని నిలదీశారు. "జెన్ జీ" తరం పిల్లలు మేల్కొని, విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిన ఈ రెండు పార్టీలను గట్టిగా నిలదీయాలని పిలుపునిచ్చారు.

గతంలో నిరసనలపై నిషేధం విధిస్తూ నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎత్తేసిన ధర్నా చౌక్ వద్దకే ఈరోజు బీఆర్ఎస్ నేతలు వచ్చి సిగ్గులేకుండా ధర్నా చేస్తుంటే పక్కనే ఉన్న ఇందిరాపార్క్, ఎన్టీఆర్ స్టేడియం పగలబడి నవ్వుతున్నాయని ఎద్దేవా చేశారు.

***నీట్ వివాదం – విద్యార్థుల ముసుగులో కమ్యూనల్, కమ్యూనిస్టు అరాచకం**

నీట్ పేపర్ లీక్ వ్యవహారం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల భావోద్వేగాలతో ముడిపడి ఉందని, ఈ ఘటనపై అందరికంటే ఎక్కువగా ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా బాధపడుతున్నారని తెలిపారు. బాధ్యులకు కఠిన శిక్ష పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయడమే కాకుండా, సీబీఐ ద్వారా 11 మంది ఫ్యాకల్టీ సహా 17 మందిని ఇప్పటికే అరెస్ట్ చేయించామని చెప్పారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్వయంగా క్షమాపణలు చెప్పారని, విద్యార్థుల విద్యా సంవత్సరం నష్టపోకుండా కేవలం 40 రోజుల్లోనే తిరిగి పరీక్షలు నిర్వహించి ఫలితాలు వెల్లడించామని వివరించారు.

ఢిల్లీలో కాక్రోచ్ పార్టీ పేరుతో జరిగిన ఆందోళనల్లో విద్యార్థుల ముసుగులో కమ్యూనిస్టు, కమ్యూనల్, అర్బన్ నక్సల్ శక్తులు చొరబడి పార్లమెంట్ పై దాడి చేసేందుకు, దేశ వ్యతిరేక నినాదాలు చేసేందుకు కుట్ర పన్నాయని మండిపడ్డారు. 118 మంది పోలీసులకు తీవ్ర గాయాలైనా, జర్నలిస్టులు, మహిళా జర్నలిస్టులపై దాడులు జరిగినా పోలీసులు నిగ్రహం పాటించారని, తప్పనిసరి పరిస్థితుల్లోనే లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చిందన్నారు.

నీట్ పరీక్షకు ఆర్టికల్ 370 రద్దుకు, ఆజాద్ కాశ్మీర్‌కు లేదా బంగ్లాదేశ్, పాకిస్తాన్, నేపాల్, శ్రీలంక వంటి దేశాలకు ఉన్న సంబంధమేమిటని ప్రశ్నించారు. రాముడు, సీతమ్మ, సనాతన ధర్మానికి నీట్ తో ఏం సంబంధమని నిలదీశారు. డాక్టర్ కావాలనుకునే నిజమైన విద్యార్థులెవరూ దేశద్రోహ నినాదాలు చేయరని, రాళ్లు విసరరని స్పష్టం చేశారు. ఈ ఉద్రిక్తతల వెనుక ఉన్న పాకిస్తాన్ కు చెందిన 480 సోషల్ మీడియా అకౌంట్లను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే బ్లాక్ చేసిందని వెల్లడించారు.

***విపక్షాల నైతికతపై ప్రశ్నాస్త్రాలు***

విపక్షాలు పార్లమెంట్ లో నీట్ పై చర్చించేందుకు సిద్ధంగా లేవని, రభస సృష్టించి నరేంద్ర మోదీని దించి రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే వారి ఏకైక లక్ష్యమని విమర్శించారు. యూపీఏ హయాంలో 72 సార్లు పేపర్లు లీక్ అయితే నాడు మన్మోహన్ సింగ్ ఎందుకు రాజీనామా చేయలేదని, రాజస్థాన్ లో అశోక్ గెహ్లాట్ పాలనలో 18 సార్లు లీక్ అయితే రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. పంజాబ్ లో ఆప్ ప్రభుత్వం, కర్ణాటక, యూపీ, బెంగాల్, కేరళలోని పబ్లిక్ సర్వీస్ కమిషన్ అవకతవకలపై ఏ రోజైనా ఆయా ముఖ్యమంత్రుల రాజీనామాలు కోరారా అని ఆక్షేపించారు. కాంగ్రెస్ తన హయాంలో నీచమైన రీతిలో లాడ్జీల్లో మెడికల్ ఎంట్రన్స్ పరీక్షలు రాయించిన చరిత్ర కలిగి ఉందన్నారు.

**కేటీఆర్ నిర్వాకం, కాంగ్రెస్ బీఆర్ఎస్ చీకటి ఒప్పందాలు**

గతంలో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా నిర్వాకం వల్ల 27 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే, వారి తల్లిదండ్రులపై లాఠీఛార్జ్ చేయించిన ఘోరాన్ని ఎవరూ మర్చిపోలేరని గుర్తుచేశారు. నాడు గ్రూప్1, టెన్త్ పేపర్ లీక్ పై తాను పోరాటం చేస్తే అర్ధరాత్రి వేళ కేసీఆర్ మద్యం తాగి పోలీస్ కమిషనర్ కు ఫోన్ చేసి జైలుకు పంపారని, కానీ కోర్టు కేసీఆర్ ప్రభుత్వానికి మొట్టికాయలు వేస్తూ తనను నిర్దోషిగా ప్రకటించిందని వివరించారు. ఈరోజు కాంగ్రెస్, బీఆర్ఎస్ లు చీకటి ఒప్పందాలతో నాటకాలాడుతున్నాయని, రేవంత్ రెడ్డి కొట్టినట్లు చేస్తే కేటీఆర్ ఏడ్చినట్లు నటిస్తున్నారని, ఇది చంపినోడే సంతాప సభ పెట్టినట్లు ఉందని విమర్శించారు. అధికారంలోకి రాగానే కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో వేస్తామన్న రేవంత్ రెడ్డి, రెండేళ్లయినా ఎందుకు చర్యలు తీసుకోలేదో, ఫోన్ ట్యాపింగ్ పై ఎందుకు ముందుకు వెళ్లడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. బీఆర్ఎస్ ఇచ్చే మూటలను కాంగ్రెస్ ఢిల్లీకి మోస్తోందని, బీఆర్ఎస్ స్కాములు కాంగ్రెస్ కు ఏటీఎంలా మారాయని ఆరోపించారు.

**బీజేపీ సంస్కరణలు – విద్యార్థులకు పిలుపు**

పేపర్ లీకేజీలను అరికట్టేందుకు 2024లోనే కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో "యాంటీ పేపర్ లీక్ బిల్లు" ప్రవేశపెడితే కాంగ్రెస్ సిగ్గులేకుండా వాకౌట్ చేసిందని గుర్తుచేశారు. భవిష్యత్తులో నీట్ పరీక్షలను జేఈఈ తరహాలోనే ఆన్ లైన్ లో నిర్వహిస్తామని తెలిపారు. 2014 కంటే ముందు దేశంలో కేవలం 51 వేల ఎంబీబీఎస్ సీట్లు, 385 మెడికల్ కాలేజీలు ఉంటే, నేడు వాటిని 1,36,000 సీట్లకు, 824 కాలేజీలకు పెంచిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనని చాటిచెప్పారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ 50వ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూనే, కేటీఆర్ బతుకంతా ఫిఫ్టీఫిఫ్టీ అయిపోయిందని, సగం రోజులు గబ్బులు.. మరో సగం రోజులు పబ్బులతోనే గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. వినాశకర శక్తులు, అర్బన్ నక్సల్స్ కుట్రల వలలో పడకుండా, విద్యార్థులంతా రాబోయే మెడికల్ కౌన్సిలింగ్ కు సిద్ధం కావాలని, భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.

ANN తెలుగు
మహా పత్రిక
శనివారం, హైదరాబాద్
25-07-2026

(మహా ప్రత్యేకం)





# సమస్యలపై 'ఎంజీఆర్' సమరం!

## నగరం ఉరకలేస్తోంది.. కానీ బస్తీ కన్నీరు కారుస్తోంది!

(మహా ప్రత్యేకం)

మహానగరం కాంక్రీట్ వనమై రూపాంతరం చెందుతోంది. ఆకాశాన్ని ముద్దాడే భవంతులు, రంగురంగుల విద్యుత్ కాంతులు ఒకవైపు మెరిసిపోతుంటే.. ఆ వెలుగుల వెనుక ఉన్న బస్తీలు మాత్రం ప్రాథమిక వసతుల కోసం అల్లాడుతున్నాయి. బిందెడు మంచి నీటి కోసం ఉదయమంతా వేచి చూసే చూపులు, రోడ్లపై పొంగిపొర్లే మురుగునీటి మధ్య జీవించే నరకయాతన, రాత్రివేళల్లో కటిక చీకట్లను నింపుకునే వీధులు.. ఇవీ నేటి బస్తీ వాసుల అంతరంగ వేదనలు! మాటల గారడీ చేసే నాయకులు ఎందరో వస్తుంటారు,పోతుంటారు. కానీ, బస్తీ జనం కష్టాన్ని తన కష్టంగా భావించి, మురికివాడల్లో పడుతున్న బాధలకు చరమగీతం పాడాలనే ఆక్రోశంతో అడుగు ముందేశారో నాయకుడు. ఆయనే ఖైరతాబాద్ నియోజకవర్గ ప్రజా ప్రతినిధి, బి.ఆర్.ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి. పదవుల పీఠాల కంటే ప్రజల గుండెల్లో చోటే మిన్న అని నమ్మిన ఎంజీఆర్.. ఖైరతాబాద్‌లోని ప్రతీ గల్లీని, ప్రతీ బస్తీ గడపను తాకుతూ చేపడుతున్న "సమస్యలపై సమరం" పాదయాత్ర ఇప్పుడు నియోజకవర్గంలో ఒక నవశకానికి నాంది పలికింది. నగరం వేగంగా విస్తరిస్తున్నా.. బస్తీ ప్రజల జీవితాల్లో మార్పు రావాలంటే వారి సమస్యలను నిరంతరం వినే నాయకుడు కావాలి. 24 గంటలు ప్రజల అందుబాటులో ఉంటూ, సమస్య వినడమే కాకుండా దానికి క్షేత్రస్థాయిలోనే పరిష్కారం చూపిస్తున్న మన్నె గోవర్ధన్ రెడ్డి బస్తీవాసుల గుండెల్లో చెరగని ముద్ర వేస్తున్నారు. ఎంజీఆర్ చేపడుతున్న ఈ సమస్యలపై సమరం ఖైరతాబాద్ బస్తీల కష్టాల పరిష్కారానికి నాందిగా నిలుస్తోంది!





## క్షేత్రస్థాయిలో ఎంజీఆర్ అలుపెరుగని పోరాటం

మహానగరంలోని బస్తీలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను స్వయంగా పరిశీలిస్తూ, వాటన్నింటికీ క్షేత్రస్థాయిలోనే అధికారులను పురమాయించి పరిష్కారం చూపుతున్నారు ఎంజీఆర్.

**1. ఇంద్రానగర్, బీజేఆర్ నగర్, శ్రీనివాస్ నగర్ – కలుషిత తాగునీటి వ్యథలు:**

ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్ క్వార్టర్స్, పాత సిఐబి క్వార్టర్స్, శ్రీనివాస్ నగర్, బీజేఆర్ నగర్, మారుతీ నగర్ ప్రాంతాల్లో గత రెండు నెలలుగా నల్లాల్లో తీవ్ర కలుషిత నీరు వస్తుండటంతో జనం రోగాల బారిన పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో పాదయాత్ర చేసిన ఎంజీఆర్, సమస్య తీవ్రతను స్వయంగా పరిశీలించారు. తక్షణమే జలమండలి అధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపాలని గట్టిగా స్పష్టం చేశారు.

**2. మూడు గుళ్ల ప్రాంతం, ప్రేమ్ నగర్ – వర్షపు నీటి నరకం & నాలాల నిర్మాణం:**

మూడు గుళ్ల వద్ద వర్షం వస్తే చాలు రోడ్డుపై వర్షపు నీరు, మురుగునీరు పొంగిపొర్లుతోంది. ఈ కష్టాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన యంత్రాంగం నలభై రెండు లక్షల రూపాయల వ్యయంతో రోడ్డు మరియు వర్షపు నీటి లైన్ పనులకు అనుమతులు తెప్పించి, వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రేమ్ నగర్, సౌత్ ప్రేమ్ నగర్ పరిధిలో తాగునీరు రాగానే తొలి పది నిమిషాలు కలుషిత నీరు రావడం, నాలా గల్లీలో రెండు క్యాచ్ పిట్ల నిర్మాణం, సాయిబాబా గుడి కమాన్ కింద ఉన్న నాలా బ్రిడ్జి వద్ద ప్రమాదాలు జరగకుండా ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేసేందుకు ఎంజీఆర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**3. సింగాడ బస్తీ, ఉదయ్ నగర్ – దెబ్బతిన్న నాలాలు & ప్రమాదకర విద్యుత్ స్తంభాలు:**

బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని సింగాడ బస్తీ, ఉదయ్ నగర్ ప్రాంతాలలో దెబ్బతిన్న మెయిన్ నాలా, రోడ్డు మధ్యలో విరిగిపోయిన క్యాచ్ పిట్ వల్ల బస్తీవాసులు ఎదుర్కొంటున్న కష్టాలను ఆలకించారు. డి లైన్ గల్లీలో పాడైన మురుగునీటి లైన్ సరిచేయడంతో పాటు, ప్రమాదకరంగా మారిన ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించి వెంటనే సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించి రెండు రోజుల్లో పనులు పూర్తయ్యేలా చూశారు.

**4. దేవరకొండ బస్తీ, దూద్ ఖానా బస్తీ – కటిక చీకట్లు & తాగునీటి సమయపాలన:**

వెంకటేశ్వర డివిజన్ పరిధిలోని దేవరకొండ బస్తీ, అలాగే దూద్ ఖానా బస్తీలలో వెలగని వీధి దీపాల వల్ల రాత్రి వేళల్లో మహిళలు, చిన్నపిల్లలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. అలాగే రెండు మూడు రోజులకు ఒకసారి, సమయపాలన లేకుండా వస్తున్న తాగునీటి సరఫరాపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అధికారులతో ఫోన్లోనే మాట్లాడి ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. దూద్ ఖానా బస్తీలో వెలగని అన్ని వీధి దీపాలను తక్షణమే సరిచేయించి, నీటి సమస్యను రెండు మూడు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

నాయకుడి సంకల్పం - ప్రజల హర్షాతిరేకాలు!

"ప్రజల సమస్యలే నా బాధ్యత... శాశ్వత పరిష్కారమే నా లక్ష్యం!"

—— **మన్నె గోవర్ధన్ రెడ్డి (ఎంజీఆర్)**

**సమస్య ఏదైనా, ఏ గల్లీలో ఉన్నా.. నిమిషాల్లో స్పందిస్తూ అధికారులతో పనులు పూర్తి చేయించడం ఎంజీఆర్ శైలి. బస్తీ బాట పట్టిన ఆయనకు మహిళలు, వృద్ధులు, యువకులు పూల వర్షం కురిపిస్తూ బ్రహ్మరథం పడుతున్నారు.**



# ఆలేరులో కార్డన్ సెర్చ్

**సరైన పత్రాలు లేని 31 ద్విచక్ర వాహనాలు, 8 గ్యాస్ సిలిండర్లు, 50 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం**

**ధర్మఘంట, జూలై 24 (మహా):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని పోచమ్మవాడ, భరత్‌నగర్, రామ్ శివాజీ నగర్, శాంతినగర్ ప్రాంతాల్లో యాదగిరిగుట్ట డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు.ఈ కార్డన్ సెర్చ్‌లో ఇద్దరు రౌడీ షీటర్లను, గంజాయి సేవించిన నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అలాగే సరైన పత్రాలు లేని 31 ద్విచక్ర వాహనాలు, 8 గ్యాస్ సిలిండర్లు, రెండు నాలుగు చక్రాల వాహనాలు, మూడు చక్రాల వాహనాలు, 50 లీటర్ల అక్రమ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఇతర రాష్ట్రాలకు చెందిన పదిమందిని గుర్తించి, వారి వివరాలను సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కార్డన్ సెర్చ్ అనంతరం డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన అనుమానాస్పద వ్యక్తులు ఈ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు.ఈ కార్డన్ సెర్చ్‌లో ఆలేరు సీఐ ఈ. యాలాద్రి, ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు, ఆలేరు ఎస్ఐ వినయ్‌తో పాటు 15 మంది ఎస్ఐలు, 130 మంది స్పెషల్ సివిల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# ఫ్లెక్సీల తొలగింపుపై బీఆర్ఎస్ నేతల రాస్తారోకో

**ఆలేరు జూలై 24 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని బస్టాండ్ సమీపంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకల ఫ్లెక్సీలు మున్సిపల్ సిబ్బంది తొలగింపు పై కార్యకర్తలు రాస్తారోకోతో నిర్వహించారు. రాస్తారోకో మూలంగా రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు కేటీఆర్ పుట్టినరోజు సంబంధించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులు తొలగించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఫ్లెక్సీల తొలగింపు చర్యలను రాజకీయ కక్షసాధింపుగా అభివర్ణిస్తూ నినాదాలు చేశారు. మున్సిపల్ కమిషనర్ డౌన్ డౌన్ అంటూ బిఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు కాంగ్రెస్ పాలకులు బి ఆర్ ఎస్ పార్టీపై కుట్రలు చేస్తున్నారని నాయకులు మండిపడ్డారు ఆలేరు సిఐ యాలాద్రి, పోలీసులు జోక్యం కల్పించుకొని రాస్తారోకోలు విరమింపజేసి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ యాట శివ, బిఆర్ఎస్ నాయకులు పంతం కృష్ణ, బీజన మధు, ఆఫీస్, రచ్చ రామ్ నరసయ్య, బింగి రవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# వలిగొండలో విద్యాసంస్థల బంద్ విజయవంతం

**దేశ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి**

**వలిగొండ జులై 24 మహా న్యూస్** వలిగొండ మండల కేంద్రంలో విద్యాసంస్థల బంద్ విద్యార్థులు విజయవంతం చేశారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనకు నిరసనగా, దేశ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, ఎన్‌టిఏ (NTA)ను రద్దు చేయాలని, ఢిల్లీలో విద్యార్థులు, యువతపై జరిగిన దాడులపై పారదర్శకంగా విచారణ జరిపించాలని, దేశంలో విద్యా కేంద్రీకరణ విధానాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పిలుపునివ్వడం జరిగింది. వలిగొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్, మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలను బంద్ చేసి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వేముల నాగరాజు, మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థుల విశ్వాసాన్ని దెబ్బతీసిందని అన్నారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు అలాగే ఎన్‌టిఏను రద్దు చేసి పారదర్శకమైన, విశ్వసనీయమైన పరీక్షల నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులు, యువతపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండిస్తూ ఆ ఘటనలపై నిష్పాక్షికంగా,పారదర్శకంగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు అదేవిధంగా దేశంలో విద్యా కేంద్రీకరణ విధానాలను వెంటనే వెనక్కి తీసుకొని, రాష్ట్రాల హక్కులను పరిరక్షించే ప్రజాస్వామ్య, సమాన విద్యా విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు అలాగే, నీట్ పేపర్ లీకేజీ కారణంగా మనస్థాపానికి గురై మరణించినట్లు పేర్కొనబడుతున్న 20 మంది విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి చొప్పున నష్టపరిహారం అందించడంతో పాటు, వారి కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో NSUI మండల అధ్యక్షులు సాయి, నాయకులు బత్తిని మధు,కార్తీక్,SFI నాయకులు నాగిళ్ల కార్తీక్, చంద్ర,వరికుప్పల ఉదయ్,భువనగిరి సాయి మరియు ఏఐవైఎఫ్ మండల నాయకులు కనకపోయిన నందు, ఏఐఎస్ఎఫ్ కోకన్వీనర్ కన్నబోయిన శివసాయి, తోట దుర్గాప్రసాద్,తదితరులు పాల్గొన్నారు



# చౌదర్‌గూడలో వనమహోత్సవం నిర్వహణ

**రాజేంద్రనగర్, మహా:** వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శంషాబాద్ మండలం చౌదర్‌గూడ గ్రామంలో సర్పంచ్ మంచాల లక్ష్మీలింగం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతిని ప్రేమించి, ప్రతి ఇంట్లో ఒక మొక్క, ప్రతి గ్రామంలో ఒక వనం అనే లక్ష్యంతో అందరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెరగడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు స్వచ్ఛమైన గాలి లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కుమార్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# రహదారి పనులను పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

- **2 లేదా 3 రోజుల్లో పనులు ప్రారంభించకపోతే టెండర్ రద్దు చేస్తా**



**యాదాద్రి భువనగిరి జూలై 24 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలం నుంచి మోత్కూరు వెళ్లే ప్రధాన రహదారిలో సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ఆ మార్గంలో ప్రయాణిస్తున్న రాష్ట్ర రోడ్లు, రవాణా మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెంటనే అక్కడే ఆగి పరిస్థితిని పరిశీలించారు. మంత్రితో పాటు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కూడా రోడ్డు పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని, పనులు ఎందుకు నిలిచిపోయాయనే విషయంపై సంబంధిత కాంట్రాక్టర్‌కు మంత్రి ఫోన్ ద్వారా వివరణ తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌తో మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రోడ్డు పనులు నిలిచిపోవడానికి గల కారణాలను తెలుసుకుని, ఎట్టి పరిస్థితుల్లోనూ మరో రెండు నుంచి మూడు రోజుల్లో పనులను తిరిగి ప్రారంభించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.అదేవిధంగా యాదగిరిగుట్ట నుండి తుర్కపల్లి రోడ్డులో కొంతమేరకు రోడ్డు నిర్మాణం మిగిలిపోయిందని దానిని కూడా వెంటనే పూర్తి చేయాలని తెలిపారు ."నిర్దేశించిన గడువులో పనులు ప్రారంభించకపోతే సంబంధిత టెండర్‌ను రద్దు చేసి, మరో ఏజెన్సీకి అప్పగించి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయిస్తాం. ప్రజలకు అసౌకర్యం కలిగేలా నిర్లక్ష్యం సహించం" అని మంత్రి కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు.దీనికి స్పందించిన కాంట్రాక్టర్, రెండు నుంచి మూడు రోజుల్లోనే రోడ్డు నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించి వేగంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యాన్ని సహించబోమని పేర్కొన్నారు. ఆలేరు నియోజకవర్గంలో చేపట్టిన ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.



## హరిత హారంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

- **మొక్కలు నాటి పచ్చదనానికి పిలుపు**

**కుషాయిగూడ, మహా :** పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా నిర్వహిస్తున్న హరిత హారం కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం తిరుమల నగర్, మీర్‌పేట్ హౌసింగ్ బోర్డు డివిజన్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షిస్తే భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న హరిత హారం కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో నకిలీ టికెట్లు కలకలం...

- **నకిలీ టికెట్లుతో దుబాయ్ వెళ్లేందుకు ప్రయత్నించడంతో...**
- **ఇద్దరు నేపాలీల అరెస్ట్.**

**రాజేంద్రనగర్ మహా ;** దుబాయ్ వెళ్లేందుకు ఇద్దరు నేపాల్ దేశస్తులు శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చారు. నేపాల్ జాతీయులను సీఐఎస్ఎఫ్, అధికారులు తనిఖీలు చేయగా వారి వద్ద ఉన్న విమాన టికెట్లు నకిలీవని తేలడంతో సిఐఎస్ఎఫ్, ఎయిర్పోర్ట్ అధికారులు శంషాబాద్ అవుట్ పోస్ట్ పోలీసులకు అప్పగించారు.వీరికి ఈ నకిలీ టికెట్లు ఎవరు ఇచ్చారు? దీని వెనుక ఏదైనా కుట్ర కోణం ఉందా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కేటీఆర్ జన్మదిన వేడుకలు.. వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ

**రాజేంద్రనగర్, మహా:** బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం పెద్దతుప్ర గ్రామంలోని సదన్ వృద్ధాశ్రమంలో వేడుకలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మంచర్ల మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పాషా, సర్పంచ్ సుమలత రాజు యాదవ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు





# ప్రతి ఓటు విలువైనదే

**ఎస్ఐఆర్ నమోదు వేగవంతం చేయాలి**
**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా :** నియోజకవర్గంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం మీర్‌పేట్ హౌసింగ్ బోర్డు డివిజన్ పరిధిలోని తిరుమల నగర్‌లో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు జాబితాలో పేరు లేకపోయినా, వివరాల్లో తప్పులు ఉన్నా సంబంధిత అధికారులను సంప్రదించి వెంటనే సరిచేసుకునేలా సహకరించాలని సంబంధిత అధికారులను బండారు లక్ష్మారెడ్డి కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని, ఒక్క ఓటు కూడా వృథా కాకుండా ప్రతి అర్హత కలిగిన వ్యక్తి ఓటు నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, బూత్ స్థాయి ఇన్‌ఛార్జీలు సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రభుదాస్, బీఆర్ఎస్ నాయకులు వంజరి ప్రవీణ్, కరిపే జంపాల రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## ఏఎస్ రావు నగర్ లో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేసిన బిజెపి నేతలు

**కుషాయిగూడ, మహా :** ఢిల్లీలోని ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ నాయకులు చేసిన అల్లర్లకు నిరసనగా గాంధీ భవన్ ముట్టడికి పిలుపునిచ్చిన బీజేపీ శ్రేణులను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ, డాక్టర్ ఏఎస్ రావు నగర్ లో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహన కార్యక్రమం నిర్వహించారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ నేతృత్వంలో పిస్తా హౌస్ నుండి రాధిక చౌరస్తా వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించి, దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో చర్చలు జరపడం చేతకాక ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ అరాచకం సృష్టిస్తోందని, శాంతియుత నిరసన తెలిపే బీజేపీ నాయకులను అరెస్ట్ చేయడం శోచనీయమని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో అంబటి వెంకటాచలం, జిల్లా కార్యదర్శి, జి.వి.ఎన్. రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు, డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షురాలు తుమ్మల సంధ్య రెడ్డి, కాప్రా డివిజన్ అధ్యక్షుడు శాంతి కుమార్, చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్, మీర్పేట్ హౌసింగ్ బోర్డ్ డివిజన్ అధ్యక్షుడు రామ్ ప్రదీప్, యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెదరాల శరత్ చంద్ర, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఏనుగు రాజు రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ సందీప్ చారి, ఏఎస్ రావు నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఉమా శ్రీధర్ సీనియర్ నాయకులు రోహిన్ కుమార్ కుమార్, సోహన్ సింగ్, కణుకుల రజనీకాంత్ రెడ్డి, దొంతుల ప్రభాకర్ వివిధ మోర్చాల ప్రతినిధులు, సీనియర్ నాయకులు మహిళా మోర్చా నేతలు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత కోసం

**ఆదిలాబాద్ మహా**: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ అనూష సూచించారు. శుక్రవారం రణదీవేనగర్‌లో 'ఫ్రైడే డ్రై డే' సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన , మున్సిపల్ కమిషనర్ జగదీశ్ గౌడ్ తో కలిసి కాలనీలో విస్తృతంగా పర్యటించారు. నిల్వ నీటిలో దోమల వృద్ధిని ప్రజలకు వివరించారు .ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా చెత్తాచెదారం పేరుకుపోకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే కూలర్లు, పాత టైర్లు, డబ్బాలు తదితర పాత్రల్లో మురికి నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా కాలనీలో బ్లీచింగ్ చల్లి, పారిశుద్ధ్య పనులు చేపట్టారు.అనంతరం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో సమావేశమైన చైర్‌పర్సన్, ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులకు పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యతను తెలియజేయాలని సూచించారు.



రోడ్లపై చెత్త వేయకుండా, మున్సిపల్ చెత్త సేకరణ వాహనం వచ్చినప్పుడు మాత్రమే చెత్తను అందజేయాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తల్లిదండ్రులను ప్రోత్సహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ప్రతి ఒక్కరూ కూరగాయలకు గాని , మార్కెట్ కి గాని వెళ్ళినప్పుడు ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్ ను కాకుండా ఇంటి నుండే ఒక సంచిని తీసుకొని వెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అన్నపూర్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వైద్య,మున్సిపల్ , శానిటేషన్ , పోలీసు అధికారులు, వివిధ శాఖల సిబ్బంది కాలనీవాసులు పాల్గొన్నారు



## ఈనెల 31 ఆలేరు బంద్ కరపత్రం ఆవిష్కరణ

**ఆలేరు జిల్లా 24 మహా** ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ఆలేరు ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీ ఆలేరు పట్టణ ఁబంద్ మరియు స్థానిక బస్టాండ్ వద్ద ధర్నా కార్యక్రమం దీనికి సంబంధించిన కరపత్రం శుక్రవారం స్థానిక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఆలేరు పట్టణ ప్రజలు,అన్ని పార్టీల నాయకులు, విద్యార్థులు, వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు, మేధావులు అందరు పాల్గొని ఆలేరు అభివృద్ధి కోసం జరిగే రెవిన్యూ డివిజన్ సాధన కోసం పాల్గొని విజయవంతం చేయలని కోరారు ఈ కార్యక్రమంలో కన్వీనర్ పసుపునూరి వీరేశం,కో కన్వీనర్ ఎండి సలీం, రాచకొండ జనార్ధన్, చెక్క వెంకటేష్, మామిడాల బిక్షపతి, కందుల మధు, బేతి కృష్ణ హరి,కామటికార్ అశోక్, ఆడెపు బాలస్వామి, జంపాల శ్రీనివాస్, వడ్డేమాన్ నరేందర్, పేరపు రాములు, మొరిగాడి రమేష్, ఇక్కిరి శ్రీనివాస్, ఎండి రఫీ,ఎండి గౌస్, యూసుఫ్, శంకర్,చింతకింది రామానుజన్,వీరస్వామి, మోరిగాడి అశోక్ తదితరులు పాల్గొన్నారు

## వీఆర్ కాలనీ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం..

**పనులకు ఆమోదం తెలిపిన ఎమ్మెల్యే**

**కుషాయిగూడ, మహా :** ఏళ్ల తరబడి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక అడుగు పడింది. చర్లపల్లి డివిజన్ పరిధిలోని వీఆర్ కాలనీలో డ్రైనేజీ అభివృద్ధి పనులను మంజూరు చేయించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కాలనీ వాసులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సైనిక్‌పురిలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లిన కాలనీ ప్రతినిధులు, స్థానికులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కాలనీలో ఎన్నోసంవత్సరాలుగా కొనసాగుతున్న డ్రైనేజీ సమస్య కారణంగా వర్షాకాలంలో మురుగు నీరు రోడ్లపైకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. ప్రజల విజ్ఞప్తిని వెంటనే పరిగణనలోకి తీసుకుని డ్రైనేజీ పనులకు ఆమోదం తెలిపి అభివృద్ధికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ, ప్రజల సమస్యలను కేవలం వింటే సరిపోదు... వాటికి పరిష్కారం చూపించే నాయకుడే నిజమైన ప్రజాప్రతినిధి అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సేవలను కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న చొరవ, అభివృద్ధి పట్ల ఉన్న నిబద్ధత అభినందనీయమని పేర్కొన్నారు. కాలనీలో డ్రైనేజీ నిర్మాణం పూర్తయిన తర్వాత మురుగు నీటి సమస్యకు పూర్తిస్థాయిలో చెక్ పడుతుందని, పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడటంతో పాటు ప్రజల ఆరోగ్య రక్షణకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, మౌలిక వసతుల కల్పనలో ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని కాలనీ పెద్దలు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల కాలనీలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు నేమూరి మహేష్ గౌడ్, వీఆర్ కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు ఏబీవీపీ నిరసన

**రాజేంద్రనగర్, మహా:** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన రూ.14 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం శంషాబాద్‌లో ఏబీవీపీ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. శంషాబాద్ జిల్లా ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్టు రహదారిపై జరిగిన ఈ ఆందోళనలో విభాగ్ కన్వీనర్ కోటి ప్రదీప్ మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ధృవ, పవన్ కుమార్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు

- మున్సిపల్ చైర్‌పర్సన్‌తో కలిసి రశీదులు అందజేసిన జిల్లా కలెక్టర్
- ఇళ్లను అద్దెకు ఇచ్చినా, విక్రయించినా కేటాయింపులు రద్దు చేస్తామని హెచ్చరిక

**ఆదిలాబాద్ మహా :** ప్రభుత్వం పేదల శాశ్వత గృహావసరాన్ని తీర్చే లక్ష్యంతో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించిన లబ్ధిదారులే నివాసంగా వినియోగించుకోవాలని, వాటిని ఇతరులకు అద్దెకు ఇవ్వడం లేదా విక్రయించడం వంటి నిబంధనలకు విరుద్ధమైన చర్యలకు పాల్పడితే విచారణ జరిపి సంబంధిత కేటాయింపులను వెంటనే రద్దు చేస్తామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా హెచ్చరించారు.శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 6 నుంచి 16 వార్డులకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు రశీదులను మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషతో కలిసి జిల్లా కలెక్టర్ అందజేశారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పేద కుటుంబాలకు సురక్షితమైన, శాశ్వత నివాస వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులను వార్డుల వారీగా పూర్తి పారదర్శకతతో లక్కీ డ్రా విధానంలో ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కేఆర్‌కే కాలనీ, మావల ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయిస్తున్నామని చెప్పారు.కేటాయించిన ఇళ్లను పరిశుభ్రంగా, బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని లబ్ధిదారులకు సూచించిన కలెక్టర్, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని అన్నారు. త్వరలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా లబ్ధిదారులకు అధికారిక ప్రొసీడింగ్స్ కాపీలను అందజేయనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, కౌన్సిలర్లు, మున్సిపల్, హౌసింగ్ శాఖల అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## హత్య కేసును ఛేదించిన పోలీసులు

**సుపారీ ఇచ్చి హత్య చేయించిన పిన తల్లి**

నిర్మల్ మహా: ఈ నెల 14న నిర్మల్ జిల్లా కేంద్రంలోని వైయస్సార్ నగర్ కాలనీలో జరిగిన అస్లాంఖాన్ అనే యువకుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. శుక్రవారం జిల్లా ప్రధాన పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ జానకి షర్మిల వివరాలు వెల్లడించారు. పిన తల్లి అన్వర్ బేగంతో అస్లాం కున్న అక్రమ సంబంధమే ఈ హత్యకు ప్రధాన కారణమని ఎస్పీ తెలిపారు. అస్లాం ఖాన్ వేరే వివాహం చేసుకోవడం ఇష్టం లేకనే సవతి తల్లి బేగం సుపారి గ్యాంగ్ తో హత్య చేయించినట్టు ఎస్పీ వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన సుపారీ గ్యాంగ్ తో అన్వర్ బేగం ఆరు లక్షలకు ఒప్పందం కుదుర్చుకొని 50వేలు అడ్వాన్స్ గా ఇచ్చినట్టు తెలిపారు. తొలి ప్రయత్నంలో విఫలమైన ఈ గ్యాంగ్ ఈనెల 14 న అద్దె వాహనంలో వచ్చి అస్లాంను వెంబడించి వైయస్సార్ కాలనీ వద్ద కత్తులతో పొడిచి చంపారన్నారు. ఆ తర్వాత సారంగాపూర్ మండలం మీదుగా మహారాష్ట్రకు పరారీ అయినట్టు వెల్లడించారు. నిందితులు ఎలాంటి ఆధారాలు చిక్కకుండా తెలంగాణ బార్డర్ నుంచి సెల్ ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి పథకం ప్రకారం హత్య చేసినట్టు తెలిపారు. ప్రత్యేక దర్యాప్తు జరిపి మహారాష్ట్రలో ఉన్న నిందితులను గుర్తించి పట్టుకుని అరెస్టు చేసినట్టు తెలిపారు. హత్య కేసును అతి త్వరలో ఛేదించిన పోలీసులకు ఎస్పీ రివార్డులను అందించారు. అయితే హత్యకు ప్రధాన నిందితురాలైన అన్వర్ బేగం ను హత్య జరిగిన రోజే అరెస్టు చేసి రిమాండ్ చేసినట్టు ఎస్పీ వెల్లడించారు. నిందితుల వద్దనుండి స్కార్పియో వాహనం. బైక్, రెండు కత్తులు, 5 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

## నమ్మించి స్కూటీ, మొబైల్‌తో ఉడాయించిన వ్యక్తి అరెస్ట్

- 48 గంటల్లో ఛేదించిన వన్ టౌన్ పోలీసులు
- నిందితునిపై వివిధ జిల్లాల్లో పలు కేసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్ రెడ్డి



**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ పట్టణంలోని ఓ షాపులో ఇటీవల బిల్ కోసం జీఎస్టీ నంబర్ తెస్తానని యజమాని స్కూటీ తో పాటు తను ఇచ్చోడ నుండి వచ్చిన ఆటో డ్రైవర్ కు చెందిన సెల్ ఫోన్ తో ఉడాయించిన వ్యక్తిని గుర్తించి కేవలం 48 గంటల్లో అరెస్ట్ చేసినట్టు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు.శుక్రవారం పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఎన్‌టీఆర్ చౌక్ వద్ద నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీల్లో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా పలు నేరాలు వెలుగులోకి వచ్చాయన్నారు. ప్రధాన నిందితుడు వడ్డేపల్లి అంతరం రమేష్ తో పాటు ముంగి చంద్రశేఖర్ రెడ్డి ని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఇదే తరహా మోసాలకు పాల్పడుతూ, హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్ షాపులు, ఆటో డ్రైవర్లు, సాధారణ ప్రజలను లక్ష్యంగా చేసుకొని వారి నమ్మకాన్ని పొందిన తర్వాత ద్విచక్ర వాహనాలు, మొబైల్ ఫోన్లు అపహరిస్తున్నట్లు అంగీకరించాడని తెలిపారు. దొంగిలించిన మొబైల్ ఫోన్లలోని ఫోన్ పే ఖాతాల ద్వారా నగదు బదిలీలు చేసి వాటిని ఖర్చు చేసినట్లు కూడా విచారణలో వెల్లడైందన్నారు.నిందితుల వద్ద నుంచి 2 ద్విచక్ర వాహనాలు, 11 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అలాగే ఇతనిపై వివిధ జిల్లాల్లో పలు కేసులున్నట్టు తెలిపారు. చోరీలకు సంబంధించిన వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్లతో సమన్వయం చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.గుర్తు తెలియని వ్యక్తులు సరుకులు కొనుగోలు చేస్తున్నట్లు, ఫోన్ మాట్లాడాలని, వాహనం కొద్దిసేపు ఇవ్వాలని కోరితే ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని, డీఎస్పీ సూచించారు. అనుమానాస్పద వ్యక్తుల గురించి వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. లాడ్జిలలో సరైన ఆధారాలు చూపని వ్యక్తులకు లాడ్జిలలో రూములను ఇవ్వవద్దని తెలిపారు. దొంగతనం చేసిన వస్తువులను కొనుగోలు చేసిన వారు నేరస్తులుగా పరిగణించబడతారని, ప్రధాన నిందితుని వద్దనుండి సెల్‌ఫోన్ కొనుగోలు చేసిన వ్యక్తి పై సైతం కేసు నమోదు చేసినట్టు తెలిపారు.ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని 48 గంటల్లో ఛేదించిన ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐ బి. సునీల్ కుమార్, ఎస్ఐలు నాగనాథ్, అశోక్ పోలీసు సిబ్బంది నరేష్ లను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారని తెలిపారు.




## విధి నిర్వహణలో పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**బెల్లంపల్లి, మహా:** పోలీసులు వీధిలో నిర్వహణలో ప్రజలతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ఝా పేర్కొన్నారు. శుక్రవారం రోజు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్‌లో ఉన్న తాండూర్ సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీల్లో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తనిఖీ చేశారు .ఈ సందర్భంగా మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్,ఏసీపీ కిరణ్ కుమార్,సీఐ దేవయ్య పుష్పగుచ్ఛం అందించి ఆయనకు స్వాగతం పలికారు.అనంతరం డీసీపీ పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు.వార్షిక తనిఖీల్లో భాగంగా తాండూర్ సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించిన పోలీస్ కమిషనర్ సర్కిల్ పరిధిలో నమోదైన గ్రేవ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసుల సీడీ ఫైళ్లు, పెండింగ్ ట్రయల్ కేసులకు సంబంధించిన సీడీ ఫైళ్లను పరిశీలించారు. ముఖ్యంగా పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని సూచించారు.కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ,సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తమ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లను క్రమం తప్పకుండా సందర్శిస్తూ,వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సిబ్బంది విధి నిర్వహణను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన మార్గదర్శకాలు అందించాలని తెలిపారు.భూ వివాదాలకు సంబంధించిన ప్రతి ఫిర్యాదును నిష్పాక్షికంగా, నిజాయితీతో విచారించి, చట్టబద్ధంగా దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు.ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తులపై అనవసరంగా బలప్రయోగం చేయరాదని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన మేరకే చట్టబద్ధమైన బలాన్ని వినియోగించాలని సూచించారు.

నేరాల నియంత్రణ కోసం రాత్రి వేళల్లో ప్రివెంటివ్ పెట్రోలింగ్, వాహనాల తనిఖీలు నిర్వహించాలని, సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని సూచించారు. ప్రతి సర్కిల్‌లో సమస్యలు తలెత్తకముందే వాటిని గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.నేరాల దర్యాప్తులో వస్తున్న తాజా పరిణామాలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలని,ముఖ్యంగా ఎస్ఐ స్థాయి నుంచి పైస్థాయి అధికారులందరూ సీసీటీఎన్ఎస్, సమాచార సాంకేతికత (ఐటీ),ఆధునిక పోలీసింగ్‌లో వినియోగిస్తున్న సాంకేతిక వ్యవస్థలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. భవిష్యత్తులో సాంకేతికత వినియోగం మరింత పెరుగుతుందని, ప్రమోషన్లతో బాధ్యతలు కూడా పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి అధికారి తమ సాంకేతిక నైపుణ్యాలను (సాఫ్ట్ స్కిల్స్) అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

ప్రతి పిటిషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, ఫిర్యాదుదారుల వివరాలను సమగ్రంగా ధృవీకరించాలని తెలిపారు.పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి పిటిషనర్ తో మర్యాదపూర్వకంగా, ఓర్పుతో వ్యవహరించి,చట్ట పరిధిలో సాధ్యమైనంత సహాయం అందించాలని సూచించారు.విధి నిర్వహణలో ఎలాంటి పక్షపాతం లేకుండా నిష్పాక్షికంగా వ్యవహరించి, చట్టబద్ధంగా ప్రజలకు న్యాయం చేయడమే ప్రతి పోలీసు అధికారి ప్రధాన బాధ్యత అని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

## పీహెచ్‌సీ పాత భవనాన్ని తొలగించి కొత్త భవన నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలి

- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, బ్యూరో మహా :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఖానాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం ఖానాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆసుపత్రి భవనం, మౌలిక సదుపాయాలు, వైద్య సేవల పై క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ప్రస్తుతం ఉన్న పాత భవనాన్ని పూర్తిగా తొలగించి, అదే స్థలంలో నూతన భవన నిర్మాణ పనులను ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.నూతన భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రజలకు వైద్య సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా ఆసుపత్రికి సమీపంలో ఖాళీగా ఉన్న బీసీ హాస్టల్ భవనాన్ని తాత్కాలికంగా వినియోగించే అవకాశాన్ని పరిశీలించారు. భవనంలో అవసరమైన మరమ్మతులు, పరిసరాల పరిశుభ్రత పనులకు అయ్యే వ్యయంపై అంచనాలు సిద్ధం చేసి వెంటనే నివేదిక సమర్పించాలని పీఆర్ ఇంజినీర్లను ఆదేశించారు. అంచనాలు అందిన వెంటనే మరమ్మతులు పూర్తి చేసి ఆసుపత్రిని తాత్కాలికంగా అక్కడికి తరలించి, నూతన భవన నిర్మాణాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. తనిఖీలో భాగంగా వ్యాక్సిన్ స్టోర్ రూమ్, మందుల నిల్వలు, హాజరు రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఈ తనిఖీలో ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఐ ప్రకాష్, ఖానాపూర్ వైద్యాధికారి డా. జ్యోతి, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ టెండర్ పురోగతి పై సమీక్ష

- బల్దియా కమిషనర్ టి. వెంకన్న

**వరంగల్,కార్పొరేషన్ మహా;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ (యూజీడీ) ప్రాజెక్టు టెండర్ ప్రక్రియ పురోగతిపై జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న శుక్రవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులు, బిల్డ్‌కాన్ సంస్థ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టెండర్ ప్రక్రియ ప్రస్తుత స్థితి, చేపట్టాల్సిన తదుపరి చర్యల పై అధికారులతో సవివరంగా చర్చించి, పెండింగ్ అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, జీడబ్ల్యూఎంసీ పరిధిలో ఏర్పాటు చేయనున్న ఏడు ఎస్‌టీపీల (సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్లు) కోసం అవసరమైన భూసేకరణ పూర్తయిందని తెలిపారు. టెండర్ ప్రక్రియ ప్రస్తుతం తుది దశలో ఉన్నందున, మిగిలిన ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి పనులు ప్రారంభించే లా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో బల్దియా సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, బిల్డ్‌కాన్ సంస్థ ప్రతినిధి అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు

## ఎస్ఐఆర్ సర్వేను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



వరంగల్, బ్యూరో మహా; వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గం లోని ఎల్‌బి నగర్, చార్ బౌలి ప్రాంతాల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, సర్వే పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఏ ఒక్క అర్హుడూ మిగిలిపోకుండా ఇంటింటి సర్వేను క్షుణ్ణంగా నిర్వహించాలని సూచించారు.సర్వే సిబ్బంది ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ, వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్ సంబంధిత రెవెన్యూ అధికారులు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.



## వారాంతపు సంతలో తూనికలు, కొలతలపై అనుమానాలు

**అధికారుల తనిఖీలు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి**

**క్యాతనపల్లి, మహా :** స్థానిక వారాంతపు సంతలో వ్యాపారులు ఉపయోగిస్తున్న తూనికలు, కొలతల్లో తేడాలు ఉన్నాయనే అభిప్రాయాన్ని పలువురు వినియోగదారులు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కూరగాయలు కొనుగోలు చేసే సమయంలో కొంతమంది వ్యాపారులు సరైన తూనికలు ఉపయోగించడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. కొన్ని దుకాణాల్లో డిజిటల్ త్రాసులు, మరికొన్ని చోట్ల సంప్రదాయ తూనికలు ఉపయోగిస్తున్నప్పటికీ వాటి ఖచ్చితత్వంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనివల్ల కొనుగోలుదారులు ఆర్థికంగా నష్టపోతున్నామని పలువురు వాపోతున్నారు. ప్రతి వారాంతపు సంతలో తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ధృవీకరించిన తూనికలు, కొలతలు మాత్రమే వినియోగించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వినియోగదారుల హక్కులను పరిరక్షించేందుకు సంబంధిత అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టి, సంతలో పారదర్శకమైన వ్యాపార లావాదేవీలు జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## కారేపల్లిలో విద్యాసంస్థల బంద్ విజయవంతం

**కారేపల్లి, మహా:** ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలను నిరసిస్తూ విద్యార్థి సంఘాల పిలుపు మేరకు కారేపల్లిలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టి, అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) నాయకులు సంఘీభావం ప్రకటించగా, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాపాలన పై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలి

- వరంగల్ లో ఇంకా ప్రారంభానికి నోచుకోని జిల్లా ఐడీఓసి భవనం
- ప్రజలు ఇబ్బందులు పడుతున్న పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్



వరంగల్, బ్యూరో మహా ;రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా పాలనను పూర్తిగా గాలికి వదిలేసిందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వరంగల్ జిల్లా ప్రజల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసి) భవన పనులు దాదాపు పూర్తి కావచ్చినా, దానిని ప్రారంభించ కుండా ప్రభుత్వం కాలయాపన చేయడాన్ని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు.ఈ సందర్భంగా గంట రవికుమార్ శివనగర్ కార్యాలయం నుండి శుక్రవారం ఓ ప్రకటన విడదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో దాదాపు

రూ. 80 కోట్ల ప్రజల సొమ్ముతో ఆజంజాహి మిల్లు మైదానంలో ఐడీఓసీ భవనాన్ని నిర్మించినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యం వల్లే నేటికీ అది ప్రజలకు అందుబాటులోకి రాలేదని విమర్శించారు. అన్ని ప్రభుత్వ శాఖలు ఒకే చోట ఉంటే ప్రజలకు పాలన సులువవుతుందనే ఉద్దేశంతో నిర్మించిన ఈ భవనాన్ని ప్రారంభించక పోవడం వల్ల, ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలు ఇరుకైన భవనాల్లో కొట్టుమిట్టాడుతున్నాయని, దీనివల్ల వరంగల్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు మంత్రిగా ఉంటూ స్థానిక సమస్యలను పరిష్కరించడంలో కొండా సురేఖ పూర్తిగా విఫలమయ్యారని గంట రవికుమార్ విమర్శించారు. సొంత జిల్లాలో ఇంత పెద్ద ప్రభుత్వ భవనం సిద్ధంగా ఉన్నా, దాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే కనీస ఆలోచన మంత్రికి లేకపోవడం సిగ్గుచేటన్నారు. మంత్రి పదవిని కాపాడుకోవడం కోసం అలాగే మంత్రి పదవి కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే వాడుకుంటున్నారే తప్ప, వరంగల్ జిల్లా అభివృద్ధిని, ప్రజల అవసరాలను ఆమె పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వానికి అభివృద్ధి పై చిత్తశుద్ధి లేదని కేవలం రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు ఉపయోగకరమైన భవనాల ప్రారంభోత్సవాలను కావాలనే వాయిదా వేస్తోందని విమర్శించారు.

**విద్యుత్ సబ్ స్టేషన్ వంకతో కాలయాపన**

విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక సబ్ స్టేషన్ పనులను ఇన్నాళ్లూ పెండింగ్ లో పెట్టి, ఇప్పుడే దానికి శంకుస్థాపనల పేరుతో డ్రామాలు చేయడం ఈ ప్రజా ప్రభుత్వ చేతకానితనానికి నిలువెత్తు నిదర్శనం అని అన్నారు. కొత్త కలెక్టరేట్ భవనం అందుబాటులోకి రాకపోవడంతో వల్ల వివిధ పనుల కోసం జిల్లా నలుమూలల నుండి వచ్చే వరంగల్ జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పాలన పై దృష్టి సారించాలని ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఐడీఓసీ భవనాన్ని తక్షణమే ప్రారంభించి, అన్ని ప్రభుత్వ శాఖలను ఒకే చోటకు చేర్చి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని గంట రవికుమార్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల పై బీజేపీ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.



# అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**

**హనుమకొండ, మహా;** పంచాయతీ రాజ్, టీజీ ఈడబ్ల్యూఐడీసీ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పంచాయతీ రాజ్, టీజీ ఈడబ్ల్యూఐడీసీ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, వివిధ సంక్షేమ గురుకుల విద్యాలయాలు, ఈజీఎస్, స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్బీఎం ) అభివృద్ధి పనుల పురోగతిపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పాఠశాలలు, వివిధ సంక్షేమ గురుకులాల్లో పంచాయతీ రాజ్, టీజీ ఈడబ్ల్యూఐడీసీ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన, చేపట్టనున్న అభివృద్ధి పనుల పురోగతి గురించి సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ పాఠశాలల్లో టాయిలెట్స్, తదితర పనులతో పాటు అంగన్వాడీ కేంద్రాలలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అభివృద్ధి పనులలో వేగం పెంచేందుకు అధికారులు ప్రతిరోజు ఫాలో అప్ చేయాలన్నారు. మహిళా సంఘాల వీవో భవనాల నిర్మాణ పనులలో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం ఉండొద్దన్నారు. ఈ సమీక్షా సమావేశంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ ఈఈ సైదుల్ రెడ్డి, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అరుణ్ కుమార్, పీఆర్ డీఈలు శ్రీనివాస్ రావు, శిరీష, యుగంధర్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ నిర్మల, బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్, సంక్షేమ గురుకులాల ఆర్సీవోలు, పంచాయతీ రాజ్ ఏఈలు , ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ జలసిరిని ప్రజా ఉద్యమంలా చేపట్టాలి

- వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు పై ప్రత్యేక దృష్టి సారించాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి




**హనుమకొండ, మహా;** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, తీవ్ర నీటి ఎద్దడి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంలా చేపట్టి విజయవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్ లో ఎంపీడీవోలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ జల సంరక్షణ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షపు నీటిని ప్రతి చుక్కను ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించే దిశగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. వీబీజీ-రామ్‌జీ పథకం కింద గ్రామాల్లో ఇంకుడు గుంతలు, ఊట కుంటలు (పర్కొలేషన్ ట్యాంకులు), పంట కుంటలు (ఫార్మ్ పాండ్స్), బోర్‌బావుల రీఛార్జ్ నిర్మాణాలను విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. ఫార్మ్ పాండ్స్ వల్ల భూగర్భ జలాలు పెరగడంతో పాటు రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని, అర్హులైన రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఫార్మ్ పాండ్స్, బోర్‌బావుల రీఛార్జ్ పనులు చేపట్టేలా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు బోర్‌బావుల రీఛార్జ్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. భూగర్భ జలాల పెంపు, నీటి వృథా నివారణపై ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావాలని తెలిపారు. తెలంగాణ జలసిరి కార్యక్రమంలో చేపట్టనున్న పనుల గుర్తింపు, అమలు విధానం, సాంకేతిక అంశాలపై టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సంబంధిత అధికారులకు జిల్లాస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ప్రతి గ్రామంలో జల సంరక్షణ పనులను సమయానికి పూర్తి చేసి ఫలితాలు కనిపించేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీలలో అధికారులు స్థానిక సర్పంచులు, ఇతర వార్డు సభ్యులు, రైతులతో సభలను నిర్వహించి ఎల్ నినో వాతావరణ పరిస్థితుల గురించి ప్రజలకు, రైతులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతీ గ్రామపంచాయతీలో నిర్దేశిత లక్ష్యం మేరకు పంట కుంటలు, ఇంకుడు గుంతలు నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సీడ్ మేళా సదస్సులో రైతులకు పంటల గురించి తెలియజేయాలన్నారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సరైన పంట విత్తనాలు ఎలా ఎంపిక చేసుకోవాలో రైతులకు వివరించాలన్నారు. వర్షపు నీటిని సంరక్షించుకునే పద్ధతులను విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సోమవారం నాటికి కాంటింజెన్సీ ప్రణాళిక నివేదికలు సంబంధిత శాఖల అధికారులు అందజేయాలన్నారు. గ్రామాలలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చేపట్టే చర్యలలో భాగంగా ప్రత్యామ్నయా నీటి వనరులను గుర్తించాలని ఎంపీడీవోలకు సూచించారు. ప్రతీ గ్రామపంచాయతీకి కాంటింజెన్సీ ప్రణాళికను రూపొందించాలన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జలసిరి కార్యక్రమంలో భాగంగా జిల్లా నిర్దేశిత లక్ష్యం వివరాలను డీఆర్డీవో మేన శ్రీను వివరించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో శేషాద్రి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



# మాదారంలో నీటి వనరులను పరిశీలించిన ఎంపీవో

**కారేపల్లి, మహా :**ఎల్నినో ప్రభావం దృష్ట్యా నీటి ఎద్దటి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవటానికి సింగరేణి మండలం మాధారం గ్రామపంచాయతీలో ఎంపీఓ రవీంద్ర ప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నరేందర్ లు పర్యటించారు. వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో ముందస్తు చర్యలో భాగంగా వేసవి కాలంలో నీటి ఎద్దడి నివారించేందుకు ప్రత్యమాయ మార్గాల కోసం కృషి చేయాలని సర్పంచ్ అజ్మీర్ ఉమా నరేష్‌కు సూచించారు. మాదారంలో మినరల్ వాటర్ ప్లాంటు పని తీరును పరిశీలించి సర్పంచ్ ను ప్రశంసించారు. పంచాయతీలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. పాత బోర్ల మరమ్మతులు చేయించి గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంచుతామని సర్పంచ్ అజ్మీర ఉమా నరేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ విజయ్, కాంగ్రెస్ నాయకులు అజ్మీర నరేష్, గుర్రం నర్సింహా రావు, కాసాని లక్ష్మీనారాయణ, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.



# జూ పార్కు లో వర్షపు నీరు నిల్వ కుండా పటిష్ట చర్యలు చేపట్టాలి

- క్షేత్రస్థాయిలో పరిశీలించిన జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న

**వరంగల్, కార్పొరేషన్ మహా;** హనుమకొండలోని కాకతీయ జులాజికల్ పార్కులో ప్రతి వర్షాకాలంలో వర్షపు నీరు నిల్వ ఉండి కొన్ని ప్రాంతాలు ముంపునకు గురవుతున్న నేపథ్యంలో, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న శుక్రవారం జిల్లా అటవీ శాఖాధికారి ముకుందరెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జూ పార్కులో నీరు నిల్వ ఉండే ప్రాంతాలు, సహజ నీటి ప్రవాహ మార్గాలు, నాలాలను పరిశీలించిన కమిషనర్, సమస్యకు గల కారణాలను అటవీ శాఖ అధికారులతో చర్చించారు. నాలాల విస్తరణ, డీసిల్టింగ్ తదితర చర్యలపై అధికారులకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, జూ పార్కులో వర్షపు నీటి నిల్వ సమస్యకు శాస్త్రీయంగా అధ్యయనం చేసి, శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర ప్రణాళిక రూపొందించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.ఈ పరిశీలనలో సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజు కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్,అసిస్టెంట్ క్యూరేటర్ మయూరి, బల్దియా డీఈలు, ఏఈలు, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్ ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలి

**ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** రిటైర్ అయిన ఉద్యోగుల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని భారత రత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు, కవి సినీగీత రచయిత గాయకులు సమాజసేవకులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్ బకాయిల విషయంపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందించినట్లుగా పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ నెలలో రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగుల అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత మూడు సంవత్సరాలుగా బకాయిలు రానటువంటి ప్రభుత్వ ఉద్యోగుల జీవితాలు రోడ్డున పడ్డాయని దాదాపు 80 మందికి పైగా ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. గత ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల పట్ల చూపిన నిర్లక్ష్యాన్ని ఉదాసీనతను అన్యాయాన్ని జీర్ణించుకోలేని ప్రభుత్వ ఉద్యోగులు అందరూ కూడా సంఘటితంగా ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతు నిచ్చి గత ప్రభుత్వాన్ని గద్దె దింపడం జరిగిందని అటువంటి అభిమానించే ప్రభుత్వ ఉద్యోగులను దూరం చేసుకోవద్దని ప్రభుత్వ ఉద్యోగులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వాలు మనుగడ సాగించలేదని హితవు చెప్పారు. సమస్యపై మల్లు భట్టి విక్రమార్క స్పందిస్తూ గత ప్రభుత్వం అవినీతి అరాచకాలతో గద్దె దిగుతూ ఖాళీ ఖజానా తమకు అందించిందని ప్రజలకు ఇచ్చిన ఆరు స్కీముల వాగ్దానాల అమలుతో పాటు రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలన్నిటిని కూడా చెల్లించడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తుందని చెప్పినట్లుగా శివకుమార్ పేర్కొన్నారు. త్వరలోనే జూన్ నాటికి రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగుల అన్ని రకాల బకాయిలను తప్పకుండా చెల్లిస్తామని మంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పినట్లుగా శివ కుమార్ వివరించారు.

# సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది

- పోటీ ప్రపంచంలో సింగరేణిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేలా కార్యాచరణ చేపట్టాలి
- కొత్త బొగ్గు బ్లాకుల అభివృద్ధితో పాటు క్రిటికల్ మినరల్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లోకి విస్తరించాలి
- సమిష్టి కృషితో సింగరేణిని మరింత బలోపేతం చేయాలి
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు




**భద్రాద్రి బ్యూరో,మహా:**సింగరేణి సంస్థను కాపాడుకోవడంతోపాటు లాభాల బాటలో నడిపించడానికి అందరు కలిసికట్టుగా పనిచేయాలని పోటీ ప్రపంచంలో కంపెనీని మరింత బలోపేతం చేయడం అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడం అధికారులు ఉద్యోగులు కార్మికులు యాజమాన్యం అందరి ఉమ్మడి బాధ్యత అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సింగరేణి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని సంస్థ భవిష్యత్తుకు అవసరమైన ప్రతి నిర్ణయానికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్), తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్(టీఎస్‌జెన్‌కో) ఉన్నతాధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడారు. తెలంగాణకు సింగరేణి ఆత్మవంటిదని, 130 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ సంస్థను కాలానుగుణంగా మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒకప్పుడు బొగ్గు ఉత్పత్తి రంగంలో సింగరేణిదే ఏకఛత్రాధిపత్యమని ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల బహిరంగ వేలం విధానాన్ని అమలు చేయడంతో అనేక ప్రైవేట్ సంస్థలు రంగంలోకి వచ్చి పోటీ తీవ్రంగా పెరిగిందన్నారు. ఈ పరిస్థితుల్లో నాణ్యత ఉత్పాదకత ఆధునిక సాంకేతికత వ్యయ నియంత్రణ ద్వారా పోటీతత్వాన్ని పెంచుకుంటేనే సింగరేణి భవిష్యత్తు మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ఒకప్పుడు బీఎస్‌ఎన్‌ఎల్ దేశంలో అత్యంత బలమైన ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్నప్పటికీ పెరుగుతున్న పోటీని సమర్థంగా ఎదుర్కోలేక వెనుకబడిన విషయాన్ని గుర్తు చేస్తూ అలాంటి పరిస్థితి సింగరేణికి రాకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. జెన్‌కోతో పాటు ఇతర విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు సరఫరా చేసే బొగ్గు అత్యున్నత నాణ్యతతో ఉండాలని స్పష్టం చేశారు. తవ్వకాల సమయంలో బొగ్గులో మట్టి రాళ్లు ఇతర మలినాలు కలవకుండా చర్యలు తీసుకోవాలని అవసరమైన చోట బొగ్గు వాషింగ్ చేపట్టి యాష్ కంటెంట్ తగ్గించాలని సూచించారు. గ్రేడ్ 4, గ్రేడ్ 5, గ్రేడ్ 6 ప్రమాణాల ప్రకారం బొగ్గును శాస్త్రీయంగా బ్లెండింగ్ చేసి సరఫరా చేయడం ద్వారా వినియోగదారుల విశ్వాసం పెరుగుతుందని మార్కెట్లో సింగరేణి ప్రత్యేకత మరింత పెరుగుతుందని తెలిపారు.సింగరేణి లాభాల్లో ఉంటేనే వేలాది మంది కార్మికులు వారి కుటుంబాల భవిష్యత్తు భద్రంగా ఉంటుందని పేర్కొంటూ సంస్థను లాభాల బాటలో నడిపించడం ప్రతి అధికారి ఉద్యోగి కార్మికుడి బాధ్యత అని స్పష్టం చేశారు. జనరల్ మేనేజర్లు డైరెక్టర్లు అధికారులు కార్మికులు కలిసి ప్రతి గని స్థాయిలో చర్చలు నిర్వహించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సొంత కుటుంబ అభివృద్ధికి చూపే నిబద్ధతతోనే సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.గత దశాబ్ద కాలంలో కొత్త బొగ్గు బ్లాకుల అభివృద్ధిలో ఆశించిన పురోగతి సాధించలేకపోయామని పేర్కొన్న ఉప ముఖ్యమంత్రి యాదాద్రి, భద్రాద్రి తదితర థర్మల్ విద్యుత్ కేంద్రాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త బొగ్గు బ్లాకులను గుర్తించి వేగంగా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒడిశాలోని నైనీ బ్లాక్, తాడిచర్ల2 ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను వేగంగా పరిష్కరించినట్లు తెలిపారు.రాబోయే 15 నుంచి 20 ఏళ్లలో ఇంధన రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకోనున్న నేపథ్యంలో సింగరేణి కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా థర్మల్ పవర్, సోలార్, పంప్డ్ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజ్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో కూడా విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సెమీకండక్టర్లు, ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలు, చిప్ తయారీకి అత్యంత కీలకమైన లిథియం, కోబాల్ట్, రేర్ ఎర్త్ మినరల్స్ వంటి క్రిటికల్ మినరల్స్ అన్వేషణ, మైనింగ్ రంగంలో సింగరేణి ప్రవేశించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఈ ఖనిజాలకు భారీ డిమాండ్ ఉన్నందున ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో క్రిటికల్ మినరల్స్ బ్లాకుల వేలంలో పాల్గొనే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. సింగరేణిలో ఉన్న మైనింగ్ నిపుణులు, ఇంజనీర్లు, కార్మికుల అనుభవాన్ని అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టుల్లో వినియోగించి సంస్థకు కొత్త ఆదాయ వనరులు సృష్టించాలని పేర్కొన్నారు.ఇకపై సింగరేణి బోర్డు సమావేశాలు కేవలం పరిపాలనా అంశాలకు పరిమితం కాకుండా సంస్థ విస్తరణ పెట్టుబడులు సాంకేతిక ఆధునీకీకరణ రాబోయే పదేళ్ల అభివృద్ధి వ్యూహంపై చర్చించే వేదికగా మారాలని సూచించారు. కార్పొరేట్ సంస్థల మాదిరిగా స్పష్టమైన లక్ష్యాలు, కాలపట్టిక రూపొందించి నిర్దిష్ట గడువులో పనులు పూర్తి చేసే విధంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా పనులను వేగవంతం చేయాలని, వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ అంశాలను ప్రతిరోజూ సమీక్షిస్తూ ప్రత్యేక కార్యాచరణతో పరిష్కరించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో నిర్ణీత గడువులో లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో సింగరేణి సంస్థ తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై కూడా సమావేశంలో సమీక్ష నిర్వహించారు. సంబంధిత శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ చేపట్టి ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక ఆదాయం ఆర్జించే ప్రభుత్వ రంగ సంస్థగా సింగరేణిని మరింత అభివృద్ధి చేసి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే సంస్థగా తీర్చిదిద్దేందుకు అధికారులు ఉద్యోగులు కార్మికులు సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా ఈ కార్యక్రమానికి ముందుగా ఎస్‌సీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ ప్రస్తుత ఆర్థిక పరిస్థితి బొగ్గు ఉత్పత్తి కొత్త బొగ్గు గనుల అభివృద్ధి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు ఆధునిక సాంకేతికత వినియోగం ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాలు భవిష్యత్ కార్యాచరణ సంస్థ దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలను వివరించారు. సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, జిల్లా కలెక్టర్ అంకిత్, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, ఎస్‌సీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్, టీఎస్‌జెన్‌కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హరీష్, ఎస్‌సీసీఎల్ డైరెక్టర్(పర్సనల్, అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్) గౌతమ్ పొట్రూ, సింగరేణి సంస్థ జనరల్ మేనేజర్లు, డైరెక్టర్లు, జెన్‌కో అధికారులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# రైతుల రహదారి బాధను తీర్చిన సర్పంచ్

**కారేపల్లి, మహా :** రైతులు నిత్యం పోలాలకు వెళ్లే నల్లకుంట చెరువుకట్ట ముండ్లపోదలతో నించి రైతులువెళ్లలేని పరిస్ధతి ఉంది. దీంతో మాణిక్యారం, ఎర్రబోడు, గాదెపాడు, ముత్యాలగూడెం, కొమ్ముగూడెం రైతులు చెరువు కట్టపై ఉన్న ముండ్ల పదలు తొలగించాలని సింగరేణి మండలం గాదెపాడు సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ విన్నవించగా స్పందించన సర్పంచ్ శుక్రవారం చెరువు కట్టపై ఉన్న ముండ్ల పొదలను తొలగించి రైతు బాధలను తీర్చారు. 7 ఏడ్లుగా ఇబ్బందులు పతున్నామని ఇప్పటికి చెరువు కట్టపై పొదలు తొలగించిన సర్పంచ్ కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



# చేవెళ్ల మండల కేంద్రంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం

**వామపక్ష విద్యార్థి సంఘాల ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్ యుఐ, పిడిఎస్యు**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** శుక్రవారం చేవెళ్ల మండలం కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలు, ప్రభుత్వ పాఠశాలు విద్యాసంస్థల బంద్ ను వామపక్షాల ఆధ్వర్యంలో విజయవంతంగా చేయడం జరిగిందన్నారు. ఎస్ఎఫ్ఐ చేవెళ్ల మండల కేంద్రంలోని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ... ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడులపై పారదర్శకంగా విచారణ జరిపించాలన్నారు. నీట్ పేపర్ లీక్ అవ్వడం వల్ల చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం అందించాలని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి, ఎన్టిఏ రద్దు చేయాలి, విబిఎస్ఏ బిల్లు వెనక్కి తీసుకోవాలని అన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్, చేవెళ్ల ఎన్ఎస్ యుఐ ఇంచార్జీ ఎండీ సమీరుద్దీన్, చేవెళ నియోజకవర్గ కార్యదర్శి శాంసన్, పిడిఎస్యు న్యాలట అశోక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కోటమైసమ్మ జాతర దుకాణాల వేలం

**రూ.2.20లక్షలు పెరిగిన వేలం ఆదాయం**



కారేపల్లి, మహా: దసరా సందర్భంగా కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి కోట మైసమ్మతల్లి ఆలయం ప్రాంగణంలో జరిగే జాతరలో దుకాణాల ఏర్పాటుకు దేవాదాయశాఖ అధికారులు శుక్రవారం వేలం పాటలు నిర్వహించారు. జాతర సందర్భంగా 11 రోజుల పాటు కొబ్బరికాయలు, పూజా సామాగ్రీ అమ్మకాలకు, లడ్డు, పులిహోరా దుకాణానికి, పుట్నాలు, పేలాలు అమ్ముకోవటానికి, కొబ్బరి చిప్పలు ప్రోగుచేసుకునే హక్కు, మిఠాయి దుకాణం, ఐస్ క్రీమ్ లు అమ్ముకాలకు వంటి 6 అంశాలపై వేలం పాటను దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ సమత ఆధ్వర్యంలో నిర్వహించారు. కొబ్బరికాయలు, పూజ సామాగ్రీకి రూ. 5.01లక్షలు, లడ్డు పులిహోర కు రూ. 1.75 లక్షలు, కొబ్బరి చిప్పల పోగు చేసుకోవటానికి రూ. 1.83 లక్షలు, ఐస్ క్రీమ్ అమ్మకాలకు రూ. 0.43 లక్షలకు పాడుకున్నారు. రెండు అంశాలైన పుట్నాలుపేలాలు, మిఠాయి అమ్మకాలకు వేలం పాటలు జరగలేదని ఆలయ ఈవో కటుకూరి వెంకటయ్య, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త డాక్టర్ పర్సా పట్టాభి రామారావు లు తెలిపారు. పాటలు నిర్వహించిన 4 అంశాలుకు సంబంధించి గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది. 2.20 లక్షలు అధిక ఆదాయం వచ్చిందన్నారు. ఈ వేలంపాటలలో ఉసిరికాయలపల్లి సర్పంచ్ వరలక్ష్మి, ఆలయ ప్రధాన అర్చకులు కొత్తలంక కైలాస శర్మ, ఉద్యోగులు పర్స సాయి, గణితి నారాయణ,మూడ్ మోహన్ చౌహన్ పాల్గొన్నారు.

# "ఆపరేషన్ ముస్కాన్" కన్వర్జెన్స్ సమావేశం

**యాదాద్రి భువనగిరి జూలై 24 మహా**

యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు భువనగిరిలోని ఎస్పీ కార్యాలయంలో ఆపరేషన్ ముస్కాన్ కన్వర్జెన్స్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు.సమావేశంలో ఆపరేషన్ ముస్కాన్‌ను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడం, తప్పిపోయిన మరియు సంరక్షణ అవసరమైన చిన్నారులను గుర్తించడం, రక్షించడం, పునరావాసం కల్పించడం, అలాగే సంబంధిత శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. చిన్నారుల భద్రత, సంక్షేమం కోసం ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు.ఈ సమావేశంలో డీసీఆర్‌బీ సీఐ హనుమంత్ నాయక్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ జయశ్రీ, సీడబ్ల్యూసీ సభ్యులు దశరథ, ఎన్జీవో ప్రతినిధి సోమ నర్సయ్య, భరోసా ఎస్ఐ సంధ్య తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ తప్పిపోయిన పిల్లల సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించి, ఆపరేషన్ ముస్కాన్ విజయవంతానికి సహకరించాలని కోరారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు

**బ్లాక్‌స్పాట్లు, పార్కింగ్‌పై కలెక్టర్ కీలక ఆదేశాలు.**




**ఖమ్మం, మహా.** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశించారు. రోడ్డు భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేసిన ఆయన, బ్లాక్‌స్పాట్లలో భద్రతా పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు ప్రమాదాలకు గల కారణాలపై శాస్త్రీయ అధ్యయనం చేసి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రతి నెల మూడో శుక్రవారం రోడ్డు భద్రతపై సమీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. శుక్రవారం కలెక్టరేట్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పోలీసు, జాతీయ రహదారులు, రోడ్లు-భవనాలు, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన రోడ్డు భద్రతా సమీక్ష సమావేశంలో కలెక్టర్ ఈ ఆదేశాలు జారీ చేశారు. సమావేశం ప్రారంభంలో గత సమావేశంలో ఇచ్చిన ఆదేశాల అమలు నివేదికను పరిశీలించారు. జిల్లాలో గుర్తించిన బ్లాక్‌స్పాట్లలో చేపట్టిన రోడ్డు భద్రతా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, జాతీయ రహదారులపై చేపట్టాల్సిన పనులను సంబంధిత శాఖల సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. జాతీయ రహదారుల వార్షిక నిర్వహణ పనులు నాణ్యతతో చేపట్టాలని పేర్కొన్నారు. పోలీసు శాఖ సమర్పించిన గణాంకాలను పరిశీలించిన కలెక్టర్, బ్లాక్‌స్పాట్లలో చర్యలు చేపట్టినప్పటికీ జిల్లాలో ఇప్పటికీ దాదాపు ప్రతిరోజూ ఒకరు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతుండటం ఆందోళనకరమన్నారు. ప్రాణాంతక ప్రమాదాలకు గల కారణాలను శాస్త్రీయంగా విశ్లేషించి సమగ్ర నివేదిక రూపొందించాలని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట్ల జిగ్‌జాగ్ ట్రాఫిక్ మూవ్‌మెంట్ వంటి ప్రత్యామ్నాయ ఇంజినీరింగ్ చర్యలను కూడా పరిశీలించాలని సూచించారు. జాతీయ రహదారుల వెంట హోటళ్లు, ధాబాల వద్ద ట్రక్కులు రోడ్లపైనే నిలిపివేయడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని పేర్కొంటూ, ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి జాతీయ రహదారులపై పార్కింగ్‌ను పూర్తిగా నిరోధించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలను పదేపదే ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే డ్రైవింగ్ లైసెన్సులను కూడా రద్దు చేయాలని సూచించారు. బెల్ట్ షాపులు, బార్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పోలీసు శాఖకు ఆదేశించారు. జాతీయ రహదారులపై అక్రమ ఆక్రమణలు, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన యాక్సెస్ రోడ్లు, అనుమతులు లేని హోటళ్లు, ధాబాల వద్ద ఉన్న అక్రమ ప్రవేశ మార్గాలను వెంటనే తొలగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించే ప్రాంతాల్లో వీధి వ్యాపారాలను నియంత్రించాలని, ప్రధాన కూడళ్లు, రెడ్‌జోన్ ప్రాంతాల్లో వీధి వ్యాపారాలకు అనుమతి ఇవ్వొద్దని ఆదేశించారు. అవసరమైతే ప్రత్యామ్నాయ స్థలాలు గుర్తించాలని సూచించారు. ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు కల్లూరు, మధిర, సత్తుపల్లి, ఏదులాపురం, వైరా పట్టణాల్లో నోవెండింగ్/రెడ్‌జోన్ ప్రాంతాలను గుర్తించి వచ్చే సమీక్ష సమావేశం నాటికి నివేదిక సమర్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ప్రాంతాల్లో శాస్త్రీయ పార్కింగ్ విధానాన్ని అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. బెంగళూరులో అమలవుతున్న పార్కింగ్ విధానాన్ని ఆదర్శంగా తీసుకుని మూడు నుంచి ఆరు నెలల్లో జిల్లాలో స్పష్టమైన మార్పు కనిపించేలా కార్యాచరణ చేపట్టాలని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు, పెద్ద షాపింగ్ సముదాయాల వద్ద కూడా పార్కింగ్‌ను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి దేశవ్యాప్తంగా అమల్లో ఉన్న రూ.1.50 లక్షల వరకు క్యాష్‌లెస్ అత్యవసర వైద్య చికిత్స సదుపాయంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రమాదం జరిగిన తొలి గంటను 'గోల్డెన్ అవర్'గా పరిగణిస్తారని, ఆ సమయంలో బాధితులకు సకాలంలో చికిత్స అందితే ప్రాణాలను కాపాడే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఆర్ఓ సి.హెచ్. రామ్మూర్తి, నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ దివ్య, డీఎంహెచ్‌వో డాక్టర్ రామారావు, ఐఆర్‌ఏడీ డీఆర్ఎంఎస్ హరిబాబు, పోలీసు, రోడ్లు-భవనాల శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ వెల్ఫేర్ బాలుర హాస్టల్‌ను తనిఖీ

**అదనపు కలెక్టర్ భాస్కర్ రావు.**

**భువనగిరి జూలై 24మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలోని ఎస్సీ వెల్ఫేర్ బాలుర హాస్టల్‌ను స్థానిక అదనపు కలెక్టర్ భాస్కరరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ హాస్టల్‌లోని విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, వసతి, భోజనం తదితర అంశాలపై ఆరా తీశారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. హాస్టల్‌లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాల గురించి విద్యార్థులను నేరుగా అడిగి తెలుసుకుని, ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.అనంతరం హాస్టల్ వంటశాలను తనిఖీ చేసి, విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించారు. వంటశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సిబ్బందికి ఆదేశించారు.హాస్టల్ పరిసర ప్రాంతాల్లో మురుగు నీరు చేరుతున్నట్లు పాఠశాల సిబ్బంది అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే సంబంధిత మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని, మురుగు నీరు నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హాస్టల్‌లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థిని..

**ఇబ్రహీంపట్నం జిల్లా 24 మహా:**

ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో హాస్టల్ గదిలో ఉరివేసుకొని విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడడం జరిగిందని సిఐ మహేందర్ రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా బల్లేపల్లి గ్రామానికి చెందిన యమల మానస, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతుందని, శుక్రవారం సాయంత్రం సమయంలో తను ఉంటున్న ప్రైవేట్ హాస్టల్ గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు వెల్లడించారు. ఆత్మహత్య గల కారణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి పూర్తి వివరాలు వెల్లడిస్తామని సిఐ మహేందర్ రెడ్డి తెలిపారు.

# సింగరేణి ప్రయోజనాలే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం

- **భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, పీకే ఓసీ గని పరిశీలన..**
- **డీఏవీ పాఠశాల ప్రారంభం..**
- **కొత్త బొగ్గు బ్లాకుల సాధనకు కార్యాచరణ సిద్ధం చేయాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**మణుగూరు, మహా :** రాష్ట్ర విద్యుత్ రంగానికి వెన్నెముకగా ఉన్న సింగరేణి సంస్థ ప్రయోజనాలే రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త బొగ్గు బ్లాకులను సాధించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో పర్యటించిన ఉప ముఖ్యమంత్రి ముందుగా భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను సందర్శించి విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ, బొగ్గు వినియోగం, భద్రతా ప్రమాణాలు, యంత్రాల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం సెంట్రల్ కంట్రోల్ యూనిట్‌ను పరిశీలించి విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**- ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్య..**

భద్రాద్రి పవర్ ప్లాంట్ టౌన్‌షిప్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డీఏవీ పాఠశాలను ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం తదితర సౌకర్యాలను పరిశీలించి ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు చేపట్టిన చర్యలను అభినందించారు.

**- పీకే ఓసీలో క్షేత్రస్థాయిలో పరిశీలన**

మణుగూరులోని ప్రకాశ్ ఖని (పీకే ఓసీ) ఓపెన్‌కాస్ట్ గనిని సందర్శించిన భట్టి విక్రమార్క బొగ్గు తవ్వకాల ప్రక్రియ, ఉత్పత్తి, నిల్వలు, గని జీవితకాలం, భద్రతా ప్రమాణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గనిలో బొగ్గును స్వయంగా చేతిలోకి తీసుకుని నాణ్యతను పరిశీలించారు. సింగరేణి దేశంలోనే అగ్రగామి బొగ్గు సంస్థగా మరింత బలోపేతం కావాలంటే ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. రాబోయే రోజుల్లో జరిగే బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి చురుగ్గా పాల్గొని కొత్త బ్లాకులను సొంతం చేసుకునేందుకు ముందస్తు కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని బొగ్గు నిల్వలను పెంపొందించడం అత్యవసరమని పేర్కొన్నారు.

**డిప్ సైడ్ బ్లాక్ కేటాయించాలని విజ్ఞప్తి**

ఈ సందర్భంగా సింగరేణి అధికారులు మాట్లాడుతూ, ఇటీవల తాడిచెర్ల బొగ్గు బ్లాక్ సింగరేణికి కేటాయించడం సంస్థకు పెద్ద ఊరటనిచ్చిందన్నారు. భవిష్యత్ ఉత్పత్తి అవసరాలను దృష్టిలో ఉంచుకుని పీకే ఓసీ డిప్ సైడ్ బ్లాక్ను కూడా సింగరేణికే కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై చొరవ చూపాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు.

**- ప్రభుత్వం అండగా ఉంటుంది..**

సింగరేణి అధికారుల వినతి మేరకు స్పందించిన భట్టి విక్రమార్క.. సింగరేణి అభివృద్ధి, విస్తరణ, కొత్త బొగ్గు బ్లాకుల సాధన, ఉద్యోగుల సంక్షేమం, ఉత్పత్తి పెంపు వంటి అన్ని అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర విద్యుత్ రంగంతో పాటు పారిశ్రామికాభివృద్ధి, వేలాది కార్మికుల జీవనోపాధికి సింగరేణి కీలకమని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, జిల్లా కలెక్టర్ అంకిత్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్ (ఐఏఎస్), టీఎస్‌జెన్‌కో సీఎండీ హరీష్ (ఐఏఎస్), సింగరేణి డైరెక్టర్ (పర్సనల్, అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్) గౌతమ్ పొట్రూతో పాటు సింగరేణి, టీఎస్‌జెన్‌కో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# నిర్మాణంలో ఉన్న జిల్లా మహిళా సమాఖ్య భవనాన్ని సందర్శించిన కేంద్ర ఎన్ ఆర్ ఎల్ ఎం బృందం

**భువనగిరి జూలై 24 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లాలో మహిళా సంఘాల బలోపేతం, మహిళా సాధికారత మరియు స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహం కల్పించే ఉద్దేశంతో నిర్మాణంలో ఉన్న జిల్లా మహిళా సమాఖ్య భవనాన్ని కేంద్ర బృందం సభ్యులు శుక్రవారం సందర్శించారు .ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి కేంద్ర బృందం సభ్యులకు భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలింపజేసి, ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణ పనులు, భవనంలో ఏర్పాటు చేయనున్న వివిధ సౌకర్యాలు మరియు జిల్లా మహిళా సమాఖ్య కార్యకలాపాలకు ఈ భవనం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే, నిర్మాణ పనులను నిర్దేశిత ప్రమాణాలు మరియు నాణ్యతతో పూర్తి చేసే విధంగా తీసుకుంటున్న చర్యలను కూడా కేంద్ర బృందానికి వివరించారు.కేంద్ర బృందం సభ్యులు భవన నిర్మాణ పనులను పరిశీలించి, మహిళా సంఘాల కార్యకలాపాలకు అనుకూలంగా భవనాన్ని సమర్థవంతంగా వినియోగించుకునే విధంగా అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన ప్రాధాన్యతను సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు శిక్షణ, సమావేశాలు, సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలు మరియు ఇతర మహిళా సాధికారత కార్యక్రమాలను నిర్వహించేందుకు జిల్లా మహిళా సమాఖ్య భవనం కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ సందర్భనలో రూరల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ నవీన్ , నేషనల్ రిసోర్స్ పర్సన్ గిరీష్ ప్రధాన్ , మిషన్ మేనేజర్ మహ్మద్ హసన్ , అడిషనల్ డి ఆర్. డి ఓ జంగారెడ్డి డీపీఎంలు స్వర్ణలత , కరుణాకర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

# మోదీపై రాఖీ సావంత్ కామెంట్ వైరల్

**మెలోని పోస్టు కింద ఆసక్తికర వ్యాఖ్య.**

**ముంబై, మహా** బాలీవుడ్ నటి రాఖీ సావంత్ చేసిన ఓ సోషల్ మీడియా కామెంట్ మరోసారి చర్చనీయాంశంగా మారింది. సీజేపీ నిర్వహించిన నిరసనకు మద్దతు ప్రకటించిన ఆమె, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని సోషల్ మీడియా పోస్టు కింద చేసిన వ్యాఖ్య ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని పరోక్షంగా ఉద్దేశిస్తూ ఆమె చేసిన కామెంట్‌పై సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చ జరుగుతోంది.

బాలీవుడ్‌లో ఐటమ్ సాంగ్స్‌తో గుర్తింపు పొందిన రాఖీ సావంత్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో 14 మిలియన్లకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. వివాదాస్పద వ్యాఖ్యలు, పోస్టులతో తరచూ వార్తల్లో నిలిచే ఆమె తాజాగా జార్జియా మెలోని వీడియోకు స్పందిస్తూ.. "మీ బాయ్‌ఫ్రెండ్‌కు రాజీనామా చేయమని చెప్పండి.. దయచేసి మీరైనా అడగండి" అంటూ కామెంట్ చేశారు. రాఖీ సావంత్ వ్యాఖ్య ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించిందేనని సోషల్ మీడియాలో నెటిజన్లు చర్చిస్తున్నారు. గతంలో అంతర్జాతీయ సమావేశాల సందర్భంగా ప్రధాని మోదీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని కలిసి కనిపించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. ఆ సందర్భాలను ఆధారంగా చేసుకుని మీమ్స్, సరదా పోస్టులు కూడా పెద్ద ఎత్తున ప్రచారంలోకి వచ్చాయి.తాజాగా రాఖీ సావంత్ చేసిన వ్యాఖ్యతో మరోసారి మోదీ-మెలోని ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియా వేదికలపై ట్రెండ్ అవుతున్నాయి. ఆమె వ్యాఖ్యపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తుండగా, సోషల్ మీడియాలో ఇది మరోసారి హాట్ టాపిక్‌గా మారింది.

# ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



**యాదాద్రి భువనగిరి జూలై 24 మహా**: యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలంలో ఆలేరు నియోజకవర్గస్థాయి బి ఎల్ ఏ తో ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహించారు..ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్ ఐ ఆర్లో 100% ఓటర్ మ్యాపింగ్ పూర్తి చేసిన బిఎల్ఏ లకు నగదు ప్రోత్సాహకం తోపాటు ఘనంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఓటు హక్కుకు అర్హులైన ఒక్కరి పేరు కూడా ఓటరు జాబితా నుంచి మిస్ కాకుండా చూడాల్సిన బాధ్యత అధికార పార్టీగా కాంగ్రెస్ ప్రభుత్వంపై, పార్టీ శ్రేణులపై ఉందని స్పష్టం చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలు, బిఎల్ ఓలకు క్షేత్రస్థాయిలో ఫారాలు నింపించడం, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను అభినందించారు. ఎన్నికల సమయంలో ఎలా జట్టుకట్టి పనిచేస్తారో అదే స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో ఇప్పటికే 98.5 శాతం ఎన్యూమరేషన్ పూర్తవడం సంతోషకరమని, త్వరలోనే అది 99 శాతానికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భువనగిరి నియోజకవర్గంలో 93 శాతం, నల్గొండలో 85 శాతం మేర ఓటరు నమోదు ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. నల్గొండ వంటి పట్టణ ప్రాంతాల్లో బయట ప్రాంతాల్లో నివసించే వారి సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, బీఎల్ఏలు, బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను నింపడంలో విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వ తరపున బీఎల్ఓలందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఓటు అనేది ప్రతి పౌరుడికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులను ప్రశ్నించే హక్కును కల్పించే అత్యంత విలువైన ప్రజాస్వామ్య ఆయుధమని అన్నారు. ఓటు హక్కు ఉంటేనే వ్యక్తికి గౌరవంతో పాటు తన అభిప్రాయాన్ని నిర్భయంగా వ్యక్తం చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇంకా వారం రోజుల సమయం ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఏలు మరింత కృషి చేసి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏ ఒక్క అర్హుడి ఓటు కూడా నమోదు కాకుండా మిగిలిపోకూడదని అన్నారు. బయట ప్రాంతాల్లో ఉన్న ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఓటు హక్కు లేని ప్రజలకు ప్రజాప్రతినిధులను ప్రశ్నించే హక్కు ఉండదని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే శక్తి ఓటు హక్కుకే ఉందన్నారు. ఎన్నికలు తర్వాతి విషయం అయినప్పటికీ, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే ప్రస్తుతం మన ముందున్న ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఎన్నికల ప్రక్రియ అత్యంత కీలకమని అన్నారు. ఓటరు జాబితా పూర్తిస్థాయిలో, పారదర్శకంగా ఉండేందుకు చేపట్టిన ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బీఎల్ఏలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయడం అభినందనీయమని పేర్కొన్నారు. 100 శాతం ఓటర్ మ్యాపింగ్ పూర్తి చేసి ఆదర్శంగా నిలిచిన బీఎల్ఏలను ప్రత్యేకంగా అభినందిస్తూ, వారి కృషికి గుర్తింపుగా నగదు ప్రోత్సాహకం అందించి సన్మానించడం ఎంతో సంతోషకరమని అన్నారు. ప్రతి గ్రామం, ప్రతి బూత్‌లో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



# కొండచరియల కింద వాహనం

**హిమాచల్‌లో 13 మంది దుర్మరణం.**

షిమ్లా, మహా : హిమాచల్ ప్రదేశ్‌లో ఘోర విషాదం చోటుచేసుకుంది. కదులుతున్న ప్రయాణికుల వాహనంపై అకస్మాత్తుగా కొండచరియలు విరిగిపడటంతో ఆరుగురు నెలల చిన్నారితో సహా 13 మంది దుర్మరణం పాలయ్యారు. మరో ఇద్దరు వాహనం నుంచి బయటకు దూకి ప్రాణాలు దక్కించుకున్నప్పటికీ గాయాలపాలయ్యారు. ప్రమాదం అనంతరం వాహనం మంటల్లో చిక్కుకోవడంతో ఘటనాస్థలిలో భయానక పరిస్థితులు నెలకొన్నాయి.పోలీసుల వివరాల ప్రకారం లాహౌల్-స్పితి జిల్లాలోని పాంగి-ఉదయ్‌పూర్ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో వాహనంలో మొత్తం 15 మంది ప్రయాణిస్తుండగా, వారంతా పాంగి లోయ ప్రాంతానికి చెందిన వారేనని అధికారులు తెలిపారు. కొండపై నుంచి భారీ రాళ్లు ఒక్కసారిగా వాహనంపై పడటంతో అది పూర్తిగా ధ్వంసమైంది.

సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, స్థానిక అధికారులు, సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన ఇద్దరిని సమీప ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం అనంతరం వాహనం వెనుక భాగంలో మంటలు చెలరేగడంతో స్థానికులు, ఆర్మీ సిబ్బంది కలిసి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

ఈ ఘటనపై భర్మోర్ ఎమ్మెల్యే జనక్‌రాజ్ స్పందిస్తూ, వాహనంలోని 15 మందిలో 13 మంది మృతి చెందారని, ఇద్దరు వాహనం నుంచి బయటకు దూకడంతో ప్రాణాలు దక్కాయని తెలిపారు. చంబా, లాహౌల్-స్పితి డిప్యూటీ కమిషనర్లు సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు.ప్రాథమిక సమాచారం ప్రకారం పాంగి-కిలాద్ రహదారిపై గురువారం కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలను అధికారులు నిలిపివేశారు. మరమ్మతులు పూర్తిచేసి శుక్రవారం ఉదయం మాత్రమే రహదారిని తిరిగి తెరిచారు. ఆ తర్వాత ప్రయాణికులు పాంగి వైపు బయలుదేరిన సమయంలోనే ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఘటనపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# బీచ్‌లో అవ్నీత్ కౌర్ గ్లామర్

ముంబై: యువ నటి అవ్నీత్ కౌర్ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. సముద్ర తీరంలో దిగిన తాజా ఫొటోల్లో ఆకాశ నీలం రంగు స్ట్రైప్ డిజైన్ బికినీలో కనిపించిన ఆమె, సహజమైన చిరునవ్వు, ఆత్మవిశ్వాసంతో అభిమానులను ఆకట్టుకుంది. అలల మధ్య ఇసుకపై నిలబడి ఇచ్చిన పోజులు ఆమె అందాన్ని మరింత హైలైట్ చేశాయి. ఈ ఫొటోలు ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్‌గా మారగా, అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.2001 అక్టోబర్ 13న జన్మించిన అవ్నీత్ కౌర్ చిన్నతనంలోనే నర్తకిగా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. డ్యాన్స్ ఇండియా డ్యాన్స్ లిల్ మాస్టర్స్ కార్యక్రమంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె, అనంతరం మేరీ మా టీవీ సీరియల్‌తో నటిగా అరంగేట్రం చేసింది. 2014లో విడుదలైన మర్దానీ చిత్రంలో రాణి ముఖర్జీతో కలిసి బాలనటిగా నటించి సినీ ప్రేక్షకులకు పరిచయమైంది.తర్వాత చంద్ర నందిని, అలాద్దీన్ - నామ్ తో సునా హోగా వంటి ప్రజాదరణ పొందిన టెలివిజన్ ధారావాహికల్లో నటించి విశేష గుర్తింపు సంపాదించింది. ముఖ్యంగా ప్రిన్సెస్ యాస్మిన్ పాత్రలో ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. టెలివిజన్ రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించిన అవ్నీత్, అనంతరం వెండితెరపై కూడా అవకాశాలను అందిపుచ్చుకుంది.సినీ రంగంలో టికూ వెడ్స్ షేరు చిత్రంలో నవాజుద్దీన్ సిద్ధిఖీ సరసన నటించిన అవ్నీత్, చిడియాఖానా, లవ్ కి అరేంజ్ మ్యారేజ్ వంటి చిత్రాల్లోనూ మెప్పించింది. అంతర్జాతీయ స్థాయిలో రూపొందిన లవ్ ఇన్ వియత్నాం (2025) చిత్రంతో ఆమె కెరీర్‌కు మరో మైలురాయి చేరింది. దీంతో బాలనటిగా ప్రారంభమైన ఆమె ప్రయాణం ఇప్పుడు కథానాయికగా విజయవంతంగా కొనసాగుతోంది.2026 నాటికి అవ్నీత్ కౌర్ నటనతో పాటు నృత్యం, డిజిటల్ కంటెంట్ క్రియేషన్ రంగాల్లోనూ సమానంగా రాణిస్తోంది. కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ఈ యువ నటి, గ్లామర్‌తో పాటు ప్రతిభను చాటుకుంటూ భారతీయ వినోద రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును మరింత బలపరుచుకుంటోంది.





## ధ్రువ్ విక్రమ్‌పై ఫిర్యాదు..
# నిర్మాతలకు షాక్

కోలీవుడ్ యువ హీరో, స్టార్ నటుడు విక్రమ్ తనయుడు ధ్రువ్ విక్రమ్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. ప్రతిభావంతుడైన నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ, సినిమాల ఎంపికలో తరచూ మార్పులు చేయడం, ఒక ప్రాజెక్ట్‌కు కమిట్ అయి మరో చిత్రానికి ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలపై ఇప్పటికే విమర్శలు ఎదుర్కొంటున్న ధ్రువ్.. ఇప్పుడు నిర్మాతల ఫిర్యాదుతో వార్తల్లో నిలిచారు.నీలాద్రి ప్రొడక్షన్స్, పెన్ స్టూడియోస్ సంయుక్తంగా ధ్రువ్ విక్రమ్ హీరోగా భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మించేందుకు ముందుకొచ్చాయి. ఈ చిత్రానికి టాలీవుడ్ దర్శకుడు రమేష్ వర్మ దర్శకత్వం వహించాల్సి ఉండగా, ధ్రువ్ కెరీర్‌లో నాలుగో చిత్రంగా దీనిని రూపొందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సినిమా కోసం నిర్మాతలు ధ్రువ్‌కు రూ.1 కోటి అడ్వాన్స్ చెల్లించడమే కాకుండా, ప్రీప్రొడక్షన్ పనులపై కూడా భారీగా ఖర్చు చేసినట్లు సమాచారం.అయితే షూటింగ్ ప్రారంభానికి సిద్ధమవుతున్న సమయంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో దర్శకుడు కరణ్ తెరకెక్కిస్తున్న కొత్త చిత్రానికి ధ్రువ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, ఆ సినిమా ప్రారంభోత్సవంలో కూడా పాల్గొన్నారు. దీంతో నీలాద్రి ప్రొడక్షన్స్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని పక్కన పెట్టారని నిర్మాతలు ఆరోపిస్తున్నారు.ఒప్పందం ప్రకారం రమేష్ వర్మ దర్శకత్వంలోని చిత్రం ధ్రువ్ నాలుగో సినిమా (#DV4)గా, మైత్రీ మూవీ మేకర్స్ చిత్రం ఐదో సినిమా (#DV5)గా ఉండాల్సి ఉందని నిర్మాతలు చెబుతున్నారు. అయితే ముందస్తు సమాచారం లేకుండా మరో చిత్రాన్ని ప్రారంభించడం వల్ల తమకు ఆర్థికంగా, వృత్తిపరంగా నష్టం జరిగిందని వారు ఆరోపించారు.ఈ నేపథ్యంలో నీలాద్రి ప్రొడక్షన్స్ తమిళ ఫిల్మ్ ఛాంబర్‌లో అధికారికంగా ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఈ వివాదంపై ధ్రువ్ విక్రమ్ లేదా మైత్రీ మూవీ మేకర్స్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. అయితే ఈ వ్యవహారం కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్ సినీ వర్గాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది. నిర్మాతల ఫిర్యాదుపై తమిళ ఫిల్మ్ ఛాంబర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# రాకా అప్డేట్‌కు రంగం సిద్ధం.. బన్నీ ఫ్యాన్స్‌లో పెరిగిన ఆసక్తి

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న తదుపరి చిత్రం 'రాకా'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటివరకు చిత్ర బృందం నుంచి అధికారిక సమాచారం చాలా పరిమితంగానే వచ్చినప్పటికీ, తాజాగా బన్నీ మేనేజర్, నిర్మాత శరత్ చంద్ర చేసిన వ్యాఖ్యలు అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. 'రాకా' నుంచి త్వరలోనే ఒక మ్యాజికల్ అప్డేట్ రానుందని ఆయన వెల్లడించడంతో సోషల్ మీడియాలో ఈ సినిమాపై చర్చలు మళ్లీ జోరందుకున్నాయి.'పుష్ప' ఫ్రాంచైజీతో అల్లు అర్జున్ దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ విశేష గుర్తింపు సంపాదించారు. దీంతో ఆయన తదుపరి చిత్రమైన 'రాకా'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాను సాధారణ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా కాకుండా, బన్నీ కెరీర్‌లో మరో మైలురాయిగా అభిమానులు భావిస్తున్నారు. దర్శకుడు అట్లీతో తొలిసారి అల్లు అర్జున్ జతకట్టడం ఈ ప్రాజెక్ట్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది.

మాస్ కమర్షియల్ సినిమాలను భారీ స్థాయిలో తెరకెక్కించడంలో అట్లీకి ఉన్న పేరుతో 'రాకా'పై సినీ వర్గాల్లోనూ ఆసక్తి నెలకొంది. అంతర్జాతీయ స్థాయి నిర్మాణ విలువలు, అత్యాధునిక విజువల్ టెక్నాలజీ, భారీ కాన్వాస్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. గ్లోబల్ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని సినిమా రూపుదిద్దుకుంటుండటంతో విడుదలకు ముందే భారీ హైప్ ఏర్పడుతోంది.

బాక్సాఫీస్ పరంగానూ 'రాకా'పై భారీ అంచనాలే ఉన్నాయి. 'పుష్ప 2' తర్వాత అల్లు అర్జున్‌కు హిందీ మార్కెట్‌లో ఏర్పడిన క్రేజ్, ఓవర్సీస్‌లో పెరిగిన అభిమాన వర్గం, ప్రపంచవ్యాప్త విడుదలలపై ఉన్న ఆసక్తి ఈ సినిమాకు భారీ ఓపెనింగ్స్ తీసుకురావొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా తొలి రోజు వసూళ్లు, తొలి వారాంతపు కలెక్షన్లు, హిందీ మార్కెట్, ఓవర్సీస్ గ్రాస్ వంటి అంశాలపై సినీ పరిశ్రమ దృష్టి సారించింది.

ఇక అల్లు అర్జున్ తన భవిష్యత్ ప్రాజెక్టుల ఎంపికలోనూ ఆచితూచి అడుగులు వేస్తున్నారు. దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో ఓ సినిమా చేయనున్న ఆయన, మరో రెండు మూడు కథలను కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. బాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖ దర్శకులు కూడా బన్నీతో సినిమా చేయడానికి ఆసక్తి చూపుతున్నారని శరత్ చంద్ర పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో 'రాకా' నుంచి రానున్న అప్డేట్ కేవలం పోస్టర్ లేదా టైటిల్ గ్లింప్స్‌కే పరిమితం కాకుండా, సినిమా స్థాయి, విడుదల ప్రణాళిక, బన్నీ కొత్త అవతారం గురించి కీలక సంకేతాలు ఇచ్చే అవకాశముందని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో అత్యంత ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టులలో 'రాకా' ఒకటిగా నిలిచింది.






## డెనిమ్ చీరలో చిట్టి స్టైల్ షో..
# ఫరియా ఫ్యాషన్ ఫిదా

జాతిరత్నాలు సినిమాలో చిట్టి పాత్రతో తెలుగు ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఫరియా అబ్దుల్లా.. కేవలం ఐదేళ్లలోనే టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపును ఏర్పరుచుకుంది. నటిగా మాత్రమే కాకుండా, తన స్టైలింగ్, ఫ్యాషన్ సెన్స్‌తోనూ ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తూ అభిమానులను ఆకట్టుకుంటోంది.తాజాగా డాన్స్ ఐకాన్ సీజన్2 కార్యక్రమంలో ఫరియా ధరించిన కస్టమ్ మేడ్ డెనిమ్ చీర సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సంప్రదాయ చీరకు ఆధునిక స్ట్రీట్ వేర్ టచ్ ఇస్తూ డెనిమ్ ఫ్యాబ్రిక్‌తో రూపొందించిన ఈ ప్రత్యేక డిజైన్‌కు బూట్స్, బెల్ట్‌లను జోడించి సరికొత్త ఫ్యూజన్ లుక్‌లో మెరిసింది. డిజైనర్ ఐశ్వర్య రూపొందించిన ఈ అవుట్‌ఫిట్‌కు శక్తి స్మరణ్ ఫోటోగ్రఫీ, అనుషా అలీ మేకప్ మరింత అందాన్ని తీసుకొచ్చాయి. "చిట్టి కిల్లర్ లుక్ అదిరిపోయింది", "ఫ్యాషన్‌కు కొత్త ట్రెండ్ సెట్ చేసింది" అంటూ నెటిజన్లు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.సినిమాల పరంగా కూడా ఫరియా బిజీగానే కొనసాగుతోంది. 2026లో విడుదలైన అనగనగా ఒక రాజు చిత్రంలో పీతాంబరి పాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఆమె, గాయపడ్డ సింహంలో షాలిని పాత్రతో నటనకు మంచి ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం తమిళతెలుగు ద్విభాషా చిత్రంగా తెరకెక్కుతున్న సిగ్మాలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ చిత్రం షూటింగ్ పూర్తిచేసుకుని విడుదలకు సిద్ధమవుతుండగా, యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రంతో తమిళ చిత్రసీమలోనూ తన స్థానాన్ని బలోపేతం చేసుకోవాలని ఫరియా భావిస్తోంది.నటనతో పాటు నృత్యం, పాటల రచన, గానం వంటి రంగాల్లోనూ తన ప్రతిభను నిరూపిస్తూ బహుముఖ ప్రజ్ఞను చాటుకుంటోంది. అందం, అభినయం, డ్యాన్స్ ప్రతిభ కలగలిసిన నటిగా ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించింది.2021లో విడుదలైన జాతిరత్నాలు సినిమాతో సినీ ప్రయాణం ప్రారంభించిన ఫరియా అబ్దుల్లా, ఆ తర్వాత మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్, బంగార్రాజు, లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్, రావణాసుర, ఆ ఒక్కటీ అడక్కు, కల్కి 2898 ఏడీ, మత్తు వదలరా2, గుర్రం పాపిరెడ్డి వంటి పలు చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. కొరియోగ్రాఫర్, లిరిసిస్ట్, సింగర్‌గా కూడా తన ప్రతిభను చాటుతూ విభిన్న రంగాల్లో రాణిస్తోంది. డెనిమ్ చీరలో చిట్టి స్టైల్ షో.. ఫరియా ఫ్యాషన్ ఫిదాఅయితే ఫరియాలో ఉన్న స్క్రీన్ ప్రెజెన్స్, నటనా సామర్థ్యం, కమాండింగ్ పర్సనాలిటీకి తగ్గ స్థాయిలో ప్రధాన కథానాయిక పాత్రలు ఇంకా రావాల్సి ఉందనే అభిప్రాయం సినీ విశ్లేషకులు, అభిమానుల్లో వ్యక్తమవుతోంది. కామియోలు లేదా సహాయ పాత్రలకు మాత్రమే పరిమితం కాకుండా, పూర్తి స్థాయి కథానాయికగా నటించే బలమైన పాత్రలు దక్కితే ఫరియా అబ్దుల్లా స్టార్ హీరోయిన్‌గా మరింత ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# మెగా హీరోలకు కామెడీ కలిసొస్తుందా?

టాలీవుడ్‌లో మెగా హీరోలు యాక్షన్, లవ్, ఫ్యామిలీ, మాస్ కథలతో ఎన్నో విజయాలు అందుకున్నప్పటికీ.. కామెడీ జానర్ మాత్రం వారికి ప్రత్యేకంగా కలిసి వచ్చిందనే అభిప్రాయం సినీ వర్గాల్లో ఉంది. చిరంజీవి నుంచి అల్లు అర్జున్ వరకు పలువురు మెగా హీరోలు వినోదాత్మక చిత్రాలతో ప్రేక్షకులను అలరించి బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలు అందుకున్నారు. ఇప్పుడు వరుణ్ తేజ్ నటిస్తున్న 'కొరియన్ కనకరాజు' కూడా పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతుండటంతో ఈ చర్చ మరోసారి మొదలైంది.

మెగాస్టార్ చిరంజీవి కామెడీ టైమింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 'చంటబ్బాయి', 'శంకర్ దాదా ఎంబీబీఎస్', 'అందరివాడు' వంటి చిత్రాల్లో ఆయన హాస్యాన్ని అద్భుతంగా పండించారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కూడా 'తొలిప్రేమ', 'బద్రి', 'జల్సా' చిత్రాల్లో తన సహజమైన కామెడీతో ప్రేక్షకులను అలరించారు. రామ్ చరణ్ 'నాయక్', 'ఎవడు' చిత్రాల్లో వినోదాత్మక సన్నివేశాలతో ఆకట్టుకోగా, 'రంగస్థలం'లో చిట్టిబాబు పాత్రలో అమాయకత్వంతో కూడిన హాస్యం ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయింది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com